RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 69 | శుక్రవారం, ఏప్రిల్ 12, 2024 | పేజీలు : 4

## ఆదిలాబాద్ లో 30 మంది కూలీలపై తేనెటీగల దాడి

హైదరాబాద్: ఆదిలాబాద్ లోని భేలా మండలంలోని రేణిగూడ కుగ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(ఎన్ఆర్ఈజిఏ) మట్టి త్రవ్వకాలు చేస్తున్న కూలీలపై గురువారం తేనెటీగలు దాడి చేశాయి. తేనెటీగలు కుట్టడం వల్ల 17 మంది కూలీలు బాధితులయ్యారని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ధ్రువీకరించారు. వారిని ఆదిలాబాద్ లోని రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(రిమ్స్)లో చేర్చారు. మిగతా 13 మందికి భేలాలోని సైదాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. ఆదిలాబాద్ ఆసుపత్రిలో చేరినవారి పరిస్థితి ఇప్పుడు మెరుగ్గా ఉంది. బాధితులకు వైద్య సదుపాయం పెంచాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.

## గెలిపించండి... అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా: ఈటెల రాజేందర్



కర్మన్ ఘాట్: ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని 10సంవత్సరాల్లో ఎంతో అభివృద్ధి చేశారని మల్కాజ్గిరి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హస్తినాపురం డివిజన్ టీఎన్ఆర్ సులక్షణ గేటెడ్ కమ్యూనిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు సామరంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కంప్యూటర్ యుగంలో ఐదు దశాబ్దాలుగా పాలించిన ఎంతో మంది ప్రధానులు చేయలేని అభివృద్ధి దశాబ్ద కాలంలో ప్రధాని నరేంద్ర మోడీ చేసి చూపించారని తెలిపారు. కేసీఆర్ పాలనలో చేసిన దొంగ వాగ్దానాలు ఏవైతే ఉన్నాయో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో పునరావృతం అవుతున్నాయని దీనిని ప్రజలు గమనించాలని కోరారు. అన్ని రకాల విషయ పరిజ్ఞానంలో మేధా సంపత్తులు మల్కాజ్గిరి ప్రజలే ముందున్నారని ఆయన అన్నారు. మినీ ఇండియా అని పిలుచుకునే మల్కాజ్గిరి పార్లమెంటు ప్రజలు విజ్ఞులని ఆలోచించి తమ ఓటు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నరసింహారెడ్డి, లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, బీజేపీ అధ్యక్షులు నరేష్ యాదవ్, అమరేందర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, రాజేందర్ ప్రసాద్, మాధవరెడ్డి, రాజేందర్, మహేందర్ రెడ్డి, రాజ వర్ధన్, మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


## ఉగ్రవాదాన్ని అణచడం చేతకాకపోతే...

# మేము సిద్ధం

న్యూఢిల్లీ: ఉగ్రవాదాన్ని అరికట్టడం పాకిస్థాన్ కు చేతకాకపోతే, భారత్ సహకారం అందించగలదని రాజ్ నాథ్ సింగ్ జాతీయ మీడియా ఇంటర్వ్యూలో తెలిపారు. భారత్ లోకి ప్రవేశించి తప్పించుకునే ఉగ్రవాదులను వెంటాడి మరీ మట్టు పెడతామని హెచ్చరించారు. భారత్ ఏ దేశంపై దాడి చేయదని కానీ భారత్ లో శాంతికి భంగం కలిగించాలని ప్రయత్నిస్తే మాత్రం ఊరుకోబోమని అన్నారు. ఇదిలా ఉండగా పాకిస్థాన్ లో చోటు చేసుకుంటున్న ఉగ్రవాదుల మిస్టరీ హత్యల వెనుక భారత్ హస్తం ఉందని యూకె పత్రిక 'ది గార్డియన్' ఇటీవల ఓ రిపోర్టులో రాసింది. కానీ దానిని భారత విదేశాంఖ తీవ్రంగా ఖండించింది. 'టార్గెట్ హత్యలు చేయడమన్నది భారత్ విధానం కాదు' అని ఖరాఖండిగా తెలిపింది. రాజ్ నాథ్ సింగ్ వ్యాఖ్యలపై పాకిస్థాన్ విదేశాంగ శాఖ స్పందించింది. ఆయన వ్యాఖ్యలు రెచ్చగొట్టేలా ఉన్నాయని పేర్కొంది.

మిస్టర్ సింగ్ పాకిస్తాన్‌కు – దాని గడ్డపై ఉగ్రవాద కార్యకలాపాలను ఎదుర్కోవడానికి సహాయం చేసే ప్రతిపాదనను కూడా పునరావృతం చేశారు. "పాకిస్తాన్ అసమర్థంగా భావిస్తే, ఉగ్రవాదాన్ని అరికట్టడానికి సహకరించడానికి భారతదేశం సిద్ధంగా ఉంది" అని ఆయన అన్నారు మరియు ఉగ్రవాదాన్ని ఉపయోగించి భారతదేశాన్ని అస్థిరపరచడమే లక్ష్యంగా ఉంటే, దాని పర్యవసానాలను అనుభవించవలసి ఉంటుందని పాకిస్తాన్‌ను హెచ్చరించారు.

సరిహద్దు దాటి పారిపోవడానికి ప్రయత్నించే ఏ ఉగ్రవాదిని అయినా భారత్ వెంబడిస్తుందని పాకిస్థాన్‌ను హెచ్చరించిన వారం తర్వాత ఈ దృఢమైన వ్యాఖ్య వచ్చింది. వారు పాకిస్తాన్‌కు పారిపోతే, వారిని




చంపడానికి మేము పాకిస్తాన్‌లోకి ప్రవేశిస్తాము, "అని అతను చెప్పాడు. ఆ వ్యాఖ్య బ్రిటీష్ దినపత్రిక ది గార్డియన్ యొక్క నివేదిక సందర్భంలో, పాకిస్తాన్‌లో ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని హత్యలు ఢిల్లీ నిర్వహిస్తున్నారని ఆరోపించింది. ప్రభుత్వం ఈ దావాను "తప్పుడు మరియు హానికరమైన భారతదేశ వ్యతిరేక ప్రచారం"గా తోసిపుచ్చింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ తన ఖండనలో, విదేశీ గడ్డపై లక్ష్యంగా హత్యలు చేయడం "భారత ప్రభుత్వ విధానం కాదు" అని ఇటీవల నొక్కిచెప్పిన దాని బాస్ ఎస్ జైశంకర్‌ని ఉటంకిస్తూ పేర్కొంది.

మంత్రిత్వ శాఖ యొక్క తిరస్కరణ ది గార్డియన్ యొక్క నివేదికలో ప్రస్తావించబడింది, ఇది భారత ప్రభుత్వం "భారత్‌కు శత్రుత్వమని భావించే వారిని లక్ష్యంగా చేసుకునే విధానాన్ని అమలు చేసింది" అని పేర్కొంది.

## జైల్లో ఉన్న కవితను మళ్లీ...

# అరెస్టు చేయడమేంటి?




న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఇప్పటికే అరెస్టయి.. తీహార్ జైలులో జ్యుడిషియల్ రిమాండ్ లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను.. తాజాగా సిబిఐ పిటి వారెంట్ తో అరెస్టు చేసింది. ఏదైనా కేసులో ఇప్పటికే అరెస్టయి జైలులో ఉన్న నిందితులను... మరో కేసులో అరెస్టు చేసేందుకు, లేదా అదే వ్యవహారంపై విచారణ జరుపుతున్న మరో దర్యాప్తు సంస్థ అరెస్టు చేసేందుకు వీలు కల్పించేదే 'ప్రిజనర్ ట్రాన్సిట్ వారెంట్'(పిటి వారెంట్). నిందితులను వేరే కేసులో అరెస్టు చేయాల్సి వస్తే.. పోలీసులు సదరు కోర్టుకు వెళ్లి అనుమతి కోరుతారు. ఏ కేసులో, ఎందుకు అదుపులోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నదో వివరిస్తారు. 'ప్రిజనర్ ట్రాన్సిట్ వారెంట్' ఇచ్చి ఆ నిందితులను తమకు అప్పగించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తారు. పోలీసులు నిందితులను ట్రాన్సిట్ వారెంట్ పై అరెస్టు చేసినా.. నిబంధనల ప్రకారం 24 గంటలలోగా తాము దర్యాప్తు చేస్తున్న ఆ మరో కేసుకు సంబంధించిన కోర్టులో హాజరుపర్చాల్సి ఉంటుంది.

ఈ కోర్టు నిందితులకు జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తే.. ఈ కోర్టు పరిధిలోని జైలుకు తరలించాల్సి ఉంటుంది. ఒకవేళ పోలీసు కస్టడీకి ఈ కోర్టు అనుమతి ఇస్తే.. ఆ గడువు వరకు పోలీసుల నిందితులను తీసుకెళ్లి వివరంగా ప్రశ్నించేందుకు అవకాశం ఉంటుంది. ఇలా పిటి వారంట్ పై ఉన్న నిందితులకు.. అన్ని కేసుల్లో బెయిల్ వస్తేనే జైలు నుంచి విడుదల అవుతారు. లేకుంటే జైల్లోనే ఉండాల్సి వస్తుంది.

# ఇంటింటికి ఇందిరమ్మ

హైదరాబాద్ : హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నటి కాంగ్రెస్ భువనగిరి. నల్గొండ స్థానాల పై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఈ రెండు స్థానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ఖాతాలో వేసుకోవాలని ఆ పార్టీ పట్టుదలతో ఉంది.అందులో భాగంగా సిఎం రేవంత్‌రెడ్డి బుధవారం జూబ్లీహిల్స్‌లోని మునుగోడు ఎంఎల్ఏ కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి నివాసానికి వెళ్ళి అక్కడ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రచార వ్యూ హాలపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉ ధృతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేవిధంగా ఇందిరమ్మ కమిటీలు వేస్తామని సిఎం ప్ర కటించారు. ప్రతి కమిటీ స భ్యుడికి ఆరు వేల గౌరవ వేతనం అందిస్తామని ఆ యన చెప్పారు. జూన్ మొదటి వారంలో స్థాని క సంస్థల ఎన్నికలన నిర్వహిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల తర్వాత ఇక నాలుగేళ్లు పూర్తిగా అభివృద్ధిపై దృష్టి పెడుతామని ఆయన కాంగ్రెస్ నేతల కు వివరించారు. కాగా జనగామలో మనకు ఎంఎల్ఏ లేరని అధైర్యపడొద్దని పా ర్టీ నేతలకు ధైర్యం చెప్పారు. ఆ సెగ్మెంట్ పరిధిలో నే చామల కిరణ్‌కు భారీ మెజార్టీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గెలుపుకోసం ప్రతి ఒక్కరూ శక్తి వం చన లేకుండా పనిచేయాలని సూ చించారు. కాం గ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సం క్షేమ పథకాలను, ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని



సూచించారు. భువనగిరి కోమటిరెడ్డి బ్రదర్స్ కంచుకోట అని అన్నా రు. ఈ టికెట్ ను కోమటిరెడ్డి కుటుంబం ఆశించి నా అధినాయకత్వం ఎవరికి ఇచ్చినా గెలుపుకో సం కృషి చేస్తామని కూడా ప్రకటించిందని గుర్తు చేశారు. అందులో భాగంగానే తాను ఇక్కడికి వ చ్చానని చెప్పారు. భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గ ప్రచార బాధ్యతలు మునుగోడు ఎమ్మెల్యేకోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అప్పగిస్తున్నట్టు పిసిసి అధ్యక్షుడు అయిన రేవంత్ రెడ్డి ప్రకటించారు. జనగామ కో–ఆర్డినేషన్ బాధ్యతను డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చూసుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 21న నామినేషన్ దాఖలు చేయనున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు.

## రైతుల సమస్యలను...

# పట్టించుకోని కాంగ్రెస్

## - ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని, రైతుల సమస్యలను గాలికి వదిలేసిందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో ఈరోజు 10 కోట్ల మంది రైతులు కిసాన్ సమ్మాన్ నిధి అందుకుంటున్నారని అన్నారు. రైతులు ఆర్థికంగా బలోపేతం కావడం కోసం బీజేపీ ప్రభుత్వం పాటుపడుతున్నదని చెప్పారు. పశు సంపదనూ తమ ప్రభుత్వం పరిరక్షిస్తూ జంతుజాలానికి ఉచిత వ్యాక్సినేషన్ కల్పిస్తున్నామన్నారు.

రాజస్థాన్‌లో గురువారం ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ 2024 ఎన్నికలు వికసిత్ భారత్ ప్రచారానికి ఊతమిస్తాయని అన్నారు. కాంగ్రెస్ వదిలేసిన ఎన్నో సమస్యలను తాము గత పదేండ్లలో చక్కదిద్దామని వివరించారు. దశాబ్దాలుగా గరీబీ హఠావో నినాదాన్ని కాంగ్రెస్ వల్లెవేసిందని, అయితే మోదీ మాత్రం 25 కోట్ల మంది భారతీయులను పేదరికం నుంచి బయటపడేశారని అన్నారు.

కాంగ్రెస్ అహంకారంతో దళితులు, గిరిజనులు ఎన్నో కష్టాలు పడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేండ్లుగా పేదల బిడ్డ ప్రధాన సేవకుడిగా మారిన తర్వాత పేదలు పలు సమస్యల నుంచి ఉపశమనం పొందుతున్నారని అన్నారు.

# భారతీయ గేమర్లతో మోడీ చర్చలు

న్యూఢిల్లీ: గేమింగ్ ఇండస్ట్రీకి సంబంధించిన అనేక అంశాలపై ప్రధాని నరేంద్ర మోడీ గురువారం భభూరతీయ గేమర్లతో చర్చలు జరిపారు. ఈ విషయాన్ని బిజెపి ఐటి సెల్ అధిపతి అమిత్ మాలవీయ ఎక్స్ వేదికగా వెల్లడించారు. గేమర్లతో ప్రధాని మోడీ చర్చలకు సంబంధించిన చిన్న వీడియోను ఆయన షేర్ చేశారు. గేమింగ్ పరిశ్రమలో జరుగుతున్న నూతన మార్పులను గురించి



వారు చర్చించారని, దేశంలో గేమింగ్ పరిశ్రమను ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం గేమర్ల సృజనాత్మకతను ఏ విధంగా గుర్తించిందో మోడీ వివరించారని మాలవీయ తెలిపారు. గ్యాంబ్లింగ్‌కు, గేమింగ్‌కు మధ్య తేడాను సంబంధించిన అశాలను చర్చించడంతోపాటు గేమింగ్ పరిశ్రమలో మహిళల భాగస్వామ్యాన్ని కూడా వారు ప్రస్తావించారని ఆయన వివరించారు. తీర్థ మెహతా, పాయల్ ధారే, అనిమేష్ అగర్వాల్, అన్షు బిష్త్, నామన్ మాథుర్, మిథిలేష్ పటంకర్, గణేస్ గంగాధర్ వంటి భారతీయ అగ్ర గేమర్లతో పిసి, విరా గేమ్లను ప్రధాని మోడీ ఆడినట్లు ఆయన తెలిపారు. చర్చలకు సంబంధించిన పూర్తి వీడియోను త్వరలో విడుదల చేస్తామని మాలవీయ తెలిపారు.

## సంపాదకీయం

### ఆందోళన సరే... చట్టాలు ఎప్పుడు

రాజకీయాల్లో పార్టీల వ్యూహాలు అనూహ్యంగా మారుతున్నాయి. ప్రత్యర్థులను, విపక్షాలను కట్టడి చేయడానికి అధికార పార్టీలు ఫోన్ ట్యాపింగ్‌ను బ్రహ్మాస్త్రంగా మార్చుకుంటున్నాయి. దేశంలోనే కాకుండా ప్రపంచంలో కూడా ఫోన్ ట్యాపింగ్‌కు కూలిపోయిన రాజ్యాలు, రాజ్యాధినేతలున్నారు. ఫోన్ ట్యాపింగ్... కొద్ది రోజులుగా తెలంగాణలో తెగ చర్చ నడుస్తోంది. ఈ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం... ప్రత్యేకంగా దర్యాప్తు బృందాన్ని కూడా ఏర్పాటు చేసింది. విచారణ చేపట్టిన సిట్.... కూపీ లాగే పనిలో పడింది. ఇందులో భాగంగా... పలువురు కీలక అధికారులను అరెస్ట్ చేసింది. వారిని కస్టడీకి తీసుకొని కీలక విషయాలను రాబట్టే పనిలో పడింది. విధ్వంసమైన ఆధారాలను కూడా రికవరీ చేసి... అసలేం జరిగిందన్న విషయాలను బయటపెట్టాలని చూస్తోంది. దీంతో ఈ కేసు వ్యవహారం జాతీయ స్థాయిలోనూ అత్యంత హాట్ టాపిక్ గా మారింది. కేవలం ప్రతిపక్ష పార్టీల నేతలే కాకుండా... పలువురు ప్రముఖుల సమాచారాన్ని కూడా ఫోన్ ట్యాపింగ్ తో సేకరించారనే వార్తలు వస్తున్నాయి. ఈ పార్టీ, ఆ పార్టీ అనే భేదం లేకుండా అధికారంలో ఉన్న పార్టీలన్నీ తన బలాన్ని ప్రజాభిమానంతో పెంచుకోవడం కన్నా ప్రత్యర్థుల కదలికలను, వ్యూహాలను ఫోన్ ట్యాపింగ్‌తో తెలుసుకుని కౌంటర్‌గా వ్యూహాలు అమలు చేయడంతో పాటు ప్రత్యర్థులను లేదా తస్మదీయులపై కేసులు పెట్టడం కూడా సరికొత్త రాజనీతిగా కనిపిస్తున్నది. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలను 'టెలిఫోన్ ట్యాపిం గ్' కుదిపివేస్తున్నది. పదేళ్లుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్‌ను ఎదుర్కోవడానికి కాంగ్రెస్, బిజెపిలు 'టెలిఫోన్ ట్యాపింగ్' ను ప్రధాన ఆయుధంగా మార్చుకోవడంతో లోక్‌సభ ఎన్నికల ముందు ఇదే ప్రధానాంశంగా మారింది. ప్రజల్లో కూడా చర్చనీయాంశమైంది. అగ్ర రాజ్యంగా పేరు పొందిన అమెరికాలో 1974లోనే ఫోన్ ట్యాపింగ్‌లో అప్పటి అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ నేరారోపణ రుజువు కావడంతో తన పదవికి రాజీనామా చేశారు. ఇది వాటర్ గేట్ కుంభకోణంగా ప్రపంచ వ్యాప్తంగా చరిత్ర కెక్కింది. దేశంలో కూడా గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటకలలో అధికార పార్టీలు తమ ప్రత్యర్థులపై నిఘాను అనధికారికంగా అమలు చేసి అప్రతిష్ఠపాలయ్యారు. ముఖ్యంగా కర్నాటకలో అప్పటి ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే తన ప్రధాన ప్రతర్థి దేవగౌడపై టెలిఫోన్ ట్యాపింగ్ చేసి ఆధారాలతో సహా దొరికిపోయి నైతిక బాధ్యతగా రాజీనామా చేశారు. చరిత్రలో ఇలాంటివి అనేక రాష్ట్రాల్లో, దేశాల్లో జరుగుతున్నా బయటికి వచ్చేవి కొన్ని మాత్రమే. గతంలో ప్రభుత్వాలు, రాజ్యాధినేతలు టెలిఫోన్ ట్యాపింగ్‌లో ఇరుక్కుపోయిన చేదు అనుభవాలున్నా రాజ్యాధినేతలు టెలిఫోన్ ట్యాపింగ్‌నే ఆయుధంగా మార్చుకోవడం ఆధునిక రాజ్యనీతిగా మారింది. ప్రస్తుతం తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న టెలిఫోన్ ట్యాపింగ్ రోజుకో మలుపు తిరుగుతున్నది. సీనియర్ పోలీసు అధికారులు సహా అనేక మంది రాజకీయ నేతలు పేర్లు కూడా బయటికి వస్తున్నాయి. అయితే ఇవి సాక్షాధారాలతో ఎలా రుజువు అవుతాయనేది ఇప్పుడే చెప్పలేకున్నా అసలు టెలిగ్రాఫిక్ చట్టం ప్రకారం టెలిఫోన్‌ను ట్యాప్ చేయడం నేరం. దీనికి తగిన శిక్షలున్నాయి. కానీ రాజకీయ నేతలెవరికీ ఈ చట్టం ప్రకారం శిక్షలు పడలేదు. ఇండియన్ టెలిగ్రాఫిక్ యాక్ట్ సెక్షన్ 5(2) ప్రకారం ఇతరుల ల్యాండ్ లేదా మొబైల్ ఫోన్ సంభాషణలు వినడం నేరం. ఇది వ్యక్తిగత స్వేచ్ఛకు పూర్తిగా భంగకరం. దేశ రక్షణ, సమగ్రత, సార్వభౌమాధికారానికి ప్రమాదం ఏర్పడిన అరుదైన సందర్భాలలోనే ట్యాపింగ్‌ను అనుమతిస్తారు. అది కూడా కేంద్ర, రాష్ట్ర హోం సెక్రటరీలు అనుమతించాలి. ట్యాపింగ్‌కు అనుమతి అవసరమనుకుంటే హోం సెక్రటరీలు తొలుత 2 నెలలకే అనుమతిస్తూ ట్యాపింగ్ ఆర్డర్ ఇస్తారు. అది ప్రత్యేక పరిస్థితిలో 6 నెలలకు మించకూడదు. దీనిని నియంత్రించడానికి ప్రత్యేక రివ్యూ కమిటీ కూడా ఉంటుంది. దీనికి తోడు సుప్రీం కోర్టు కూడా పలు సందర్భాల్లో టెలిఫోన్ ట్యాపింగ్ చట్ట అనుమతి దుర్వినియోగం కాకుండా అనేక పరిమితులు కూడా విధించింది. దేశంలో అనేక రాష్ట్రాల్లో ట్యాపింగ్ అనేది అధికార పార్టీ చేతిలో బ్రహ్మాస్త్రంగా మారింది. నేటి ప్రధాని నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ గుజరాత్ రాష్ట్రంలో కూడా టెలిఫోన్ ట్యాపింగ్‌ను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఆ రాష్ట్రంలో ఒక మహిళ టెలిఫోన్‌ను ట్యాప్ చేశారని అప్పట్లో రాజకీయ ప్రకంపనలు చెలరేగాయి. ట్యాపింగ్‌లో కూడా ఆధునికత చోటు చేసుకున్నది. టెక్నాలజీ పెరుగుదలతో పాటు సంభాషణలు వినే రికార్డు చేసే అత్యాధునిక సామగ్రి ప్రపంచ విపణిలో సులభంగా దొరుకుతున్నది. ముఖ్యంగా ఇజ్రాయెల్ దేశం పెగాసస్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా టెలిఫోన్ ట్యాపింగ్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నదని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతున్నది. కాని అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో టెలిఫోన్ ట్యాపింగ్‌ను నియంత్రించే ప్రత్యేక చట్టాలు ఎవరూ చేయడం లేదు.

ట్యాపింగ్ ఆరోపణలు ఆధారాలతో సహా రుజువు కాకపోవడంతో ఎవరికీ శిక్షలు పడడం లేదు. ఈ చట్టం అంటే భయం కూడా ఎక్కడా లేదు.

# ఫోన్ ట్యాపింగ్‌లో... షాకింగ్ పరిణామాలు


- మనీల్యాండరింగ్‌పై ఇడికి ఫిర్యాదు వ్యాపారస్థులను బెదిరించి
- కోట్లు వసూలు చేశారని ఆరోపణ హవాలా మార్గంలో
- తరలించినట్లు నిందితులు అంగీకరించారని ఫిర్యాదులో స్పష్టీకరణ
- ఫిర్యాదు నేపథ్యంలో ఇడి జోక్యంపై జోరెత్తిన ఊహాగానాలు
- రాధాకిషన్‌రావుపై మరో పోలీసు కేసు నమోదు..రిమాండ్ పొడిగింపు
- ప్రత్యేక పిపిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్: రాష్ట్రంలో ప్ర కంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు లో రోజుకో కీలక పరిణామం చోటు చేసుకుంటోంది. ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైకోర్టు సీనియర్ న్యాయవాది సురేష్ కేంద్ర దర్యాప్తు సం స్థ ఇడికి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర వ్యాప్తం గా వార్ రూములను ఏర్పాటు చేసి రాజకీ య నాయకుల, బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపారుల ఫోన్లు ట్యాప్ చేసి, రకరకాల సె టిల్మెంట్లకు, బెదిరింపులకు పాల్పడ్డారని, పో లీసు ఉన్నతాధికారుల నుండి, కిందిస్థాయి ఉద్యోగుల వరకు ఇందులో ఇన్వాల్వ్ అయి ఉన్నారని తాజాగా జరుగుతున్న విచారణ లో తెలిసింది. అంతేకాదు ఫోన్ ట్యాపింగ్ బ్లాక్‌మెయిల్ చేయడం ద్వారా కోట్లు వసూ లు చేశారని, ఈ డబ్బులను ఎన్నికల కోసం వాహనాలలో తరలించారని, ఎన్నికల సమయంలో పోలీస్ అధికారుల ముతా వాహనాలలోనే అధికార పార్టీకి చెందిన డబ్బు తరలింపు జరిగిందని ప్రధానంగా వెలుగుచూసింది. ఈ క్రమంలో తాజాగా హైకోర్టు న్యా యవాది సురేష్ ఫోన్ ట్యాపింగ్ కేసులో మ నీలాండరింగ్ కోణాన్ని దర్యాప్తు చేయాలని ఇడి అధికారులకు ఫిర్యా దు చేశారు. ఈ కేసులో పిఎంఎల్ఎ చట్టం కింద కేసు నమోదు చేయాలని పేర్కొన్న అడ్వకేట్ సురేష్ ఈ కేసులో అసలు నిందితులను ఇప్పటివరకు విచారించ లేదని, ఇడి కేసు నమోదు చేసి రంగంలోకి దిగి దర్యాప్తు చేస్తే అసలు నిందితులు బయటకు వస్తారని తన ఫిర్యాదులో వెల్లడించారు. నిందితులు ఫోన్ ట్యాపింగ్‌తో కోట్లా ది రూపాయలు వసూలు చేశారు. రాజకీయ నాయకుల ఫోన్లను ట్యాప్ చేయడమే కాకుండా, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తల ఫోన్లు ట్యాప్ చేసి వారిని బ్లాక్ మెయిల్ చేసి కోట్లాది రూపాయలు వసూలు చేశారని, ఎన్నికల సమయంలో పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించారని నిందితులు విచారణలో స్వయంగా ఒప్పుకున్నారు అని పిటిషన్‌లో వెల్లడించారు. ఇడి ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొని కేసు నమోదు చేయాలన్నారు. రాష్ట్ర వ్యా ప్తంగా పెను దుమారం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు లో ఫిర్యాదు నేపథ్యంలో ఇడి ఎంట్రీ ఇస్తుందా? ఒకవేళ ఈ కేసులో ఇడి ఎంటర్ అయితే ఎలా ఉండబోతుంది? అన్నది ప్రస్తుతం ఆసక్తిని రేపుతోంది.

**టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావుపై మరో పోలీసు కేసు నమోదు...**

టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావు అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఆయనతో పాటు, మరో ఎనిమిది మంది పై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. చెన్నుపాటి వేణుమాధవ్ అనే వ్యాపార వేత్త ఫిర్యాదు మేరకు, పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హార్వ ర్డ్ యూనివర్సిటీలో ఎంబిఎ చదువుకుని వరల్డ్ బ్యాం కులో పనిచేసిన తాను, 2011లో క్రియా పేరుతో హెల్త్‌కేర్ సర్వీస్‌ను ప్రారంభించిట్లు వేణుమాధవ్ ఫిర్యాదులో వెల్లడించారు. 2014లో ఎపిలో అప్పటి ప్రభుత్వంలో 165 హెల్త్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేసి, ప్రభు త్వ హెల్త్‌కేర్ సెంటర్లలో పలు రకాల సేవలు అందించారన్నారు. వీటితో పాటు ఖమ్మంలో టెలిమెడిసిన్, జాతీయ రహదారులపై అత్యవసర వాహనాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు.

కాగా ఉత్తరప్రదేశ్‌లో హెల్త్ కేర్ సెంటర్ల ప్రాజెక్టు తమకు వచ్చిన సమయంలో, పార్ట్‌టైమ్ డైరెక్టర్లుగా గోపాల్, రాజ్, నవీన్, రవిలను నియమించుకున్నామని, బాలాజీ అనే వ్యక్తిని సిఇఒగా పెట్టామని



వెల్లడించారు. ఇదే క్రమంలో చంద్రశేఖర్ వేగే అనే తనకు తెలిసిన వ్యక్తి తమ కంపెనీలో షేర్లు కొని, డైరెక్టర్లతో కుమ్మక్కై కంపెనీ మొత్తాన్ని స్వాధీనం పరుచు కునేందుకు ప్రయత్నించారని వెల్లడించారు. తాను ఒప్పుకోకపోడంతో టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్, ఇన్స్‌పెక్టర్ గట్టుమల్లు, ఎస్ఐ మల్లిఖార్జున్ల సాయంతో కిడ్నాప్ చేయించి, డిసిపి కార్యాలయంలో చిత్రహింసలకు గురిచేశారని వెల్లడించారు. చంద్రశేఖర్ చెప్పినట్లుగా వినాలని లేకుంటే చంపేస్తామని బెదిరించినట్లు ఫిర్యాదులో ఆయన తెలిపారు. 100కోట్ల తన కంపెనీని అతని పేరుపై రాయించుకునే ప్రయత్నం చేశారని వెల్లడించారు. మీడియాకి, ఉన్నతాధికారులకు చెప్తే వేరే పరిణామాలు ఉంటాయని హెచ్చరించారన్నారు. సిఐ గట్టుమల్లు అతని బృందానికి 10లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో వెల్లడించారు. తాజాగా రాధాకిషన్ అరెస్ట్ వార్తలు విని, ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఘటనపై నిందితులపై చర్యాలు తీసుకోవాలని కోరారు. రాధాకిషన్ రావు సహా 9మందిపై 386, 365, 341, 120బి రెడ్ విత్ 34, సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**రాధాకిషన్‌రావు రిమాండ్ పొడిగింపు**

ఫోన్ ట్యాపింగ్ కేసులో టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావు రిమాండ్‌ను కోర్టు పొడిగించింది. వారం రోజుల పోలీసు కస్టడీ ముగియడంతో పోలీసులు ఆయననను నాంపల్లి కోర్టులో బుధవారం హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ నెల 12 వరకు రిమాండ్‌ను పొడిగిస్తున్నట్లు వెల్లడించింది. జైలులో లైబ్రరీకి వెళ్లేందుకు అనుమతించడం లేదని రాధాకిషన్‌రావు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. జైలు సూపరింటెండెంట్‌ను సైతం కలవనీయడం లేదని వెల్లడించారు. దీంతో పోలీసులను న్యాయమూర్తి పిలిపించి ప్రశ్నించారు. లైబ్రరీలోకి అనుమతించడంతో పాటు సూపరింటెండెంట్‌ను కలిసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. తొలుత గాంధీ ఆసుపత్రిలో రాధాకిషన్‌రావుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కోర్టు రిమాండ్ విధించినానంతరం చంచల్‌గూడ జైలుకు పోలీసులు తరలించారు.

**హై ప్రొఫైల్ కేసు కావడంతో ప్రత్యేక పిపిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయం?**

ఇదిలా ఉండగా, ఈ కేసుకు సంబంధించి కోర్టులో విచారణ కోసం ప్రత్యేక పిపిని నియమించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. నెలరోజులుగా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. రాధాకిషన్‌రావుతో పాటు మాజీ అడిషినల్ ఎస్‌పిలు భుజంగరావు, తిరుపత్న, మాజీ డిఎస్‌పి ప్రణీత్‌రావులను అరెస్ట్ చేశారు.. హై ప్రొఫైల్ కేసు కావడంతో ప్రత్యేక పిపిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

# మా పాలనలో సొంత గడ్డపైనే ఉగ్రవాదులు హతం: ప్రధాని మోడీ



రిషికేష్(ఉత్తరాఖండ్): అత్యంత శక్తివంతమైన బిజెపి సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం కింద పనిచేస్తున్న భద్రతా దళాలు ఉగ్రవాదులను వారి సొంత గడ్డపైనే హతమారుస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. గురువారం నాడిక్కడ ఒక ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ సుస్థిర ప్రభుత్వ ప్రయోజనాలను ప్రజలు కళ్లారా చూస్తున్న కారణంగా ఫిర్ ఏక్ బార్ మోడీ సర్కార్ అన్న నినాదాలు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తున్నాయని చెప్పారు. దేశంలో బలహీనమైన, అస్థిరమైన ప్రభుత్వాలు ఉన్న చోట శత్రువులు పెట్రేగిపోవడమేగాక ఉగ్రవాదం వ్యాప్తి చెందుతుందని మోడీ అన్నారు. కాని..కేంద్రంలో బలమైన మోడీ ప్రభుత్వం ఉండడంతో ఉగ్రవాదులను వారి సొంత గడ్డపైనే భద్రతా దళాలు అంతం చేస్తున్నాయని ఆయన చెప్పారు. దేశాన్ని లూటీ చేయకుండా అవినీతిపరులను తాను అడ్డుకున్నానని, దీంతో వారికి తనపైన పీకలదాకా కోపం ఉందని మోడీ వ్యాఖ్యానించారు. గతంలో ఉన్న బలహీనమైన కాంగ్రెస్ ప్రభుత్వాలు సరిహద్దుల్లో మైలిక సౌకర్యాలను పటిష్టం చేయలేదని, ఇప్పుడు సరిహద్దుల వెంబడి రోడ్లు, ఆధునిక సొరంగాలు నిర్మాణం అవుతున్నాయని ప్రధాని తెలిపారు. శ్రీరాముడి ఉనికినే ప్రశ్నించిన కాంగ్రెస్ అయోధ్యలో ఆలయ నిర్మాణాన్ని వ్యతిరేకించిందని మోడీ ఆరోపించారు. అయినప్పటికీ తాము క్షమించి అయోధ్యలో ఆలయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి కాంగ్రెస్‌ను ఆహ్వానించామని, అయినప్పటికీ దాన్ని కూడా కాంగ్రెస్ బహిష్కరించిందని మోడీ చెప్పారు. ఇంతటితో ఆగకుండా శక్తి స్వరూపిణులుగా భక్తులు కొలిచే ఉత్తరాఖండ్‌లోని మా ధారీ దేవి, మా చంద్రబద్నీ, మాజీ జ్వల్పాదేవి వంటి దేవలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ బహిరంగంగా యుద్ధం ప్రకటించిందని మోడీ ఆరోపించారు. ఉత్తరాఖండ్ సంస్కృతిని ధ్వంసం చేయడానికి ప్రస్తుతం జరుగుతున్న కుట్రకు ఇటువంటి ప్రకటనలు అగ్నికి ఆజ్యం పోసినట్లు మారతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం నేర్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

# రేవంత్ రెడ్డి పదేళ్లు సిఎం: మంత్రి కోమటిరెడ్డి



భారతీయ జనతా పార్టీ మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతోందని కాంగ్రెస్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. రేవంత్ రెడ్డి పదేళ్లు సిఎంగా ఉంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఏక్ నాథ్ షిండేలు ఎవరూ లేరని వివరించారు. అందరం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఏక్ నాథ్ షిండేలను సృష్టించిందే బిజెపి అన్నారు. హరీశ్ రావు, మహేశ్వర్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని మంత్రి కోరారు. బిఆర్ఎస్ కి ఒక్క ఎంపి సీటు కూడా రాదు అని కోమటిరెడ్డి జోస్యం చెప్పారు. బిఆర్ఎస్ ఒక్క సీటు గెలిస్తే... తాను దేనికైనా సిద్ధమేనని సవాల్ విసిరారు. కాంగ్రెస్ అంతర్గత విషయాలు మహేశ్వర్ రెడ్డి మాట్లాడొద్దని సూచించారు. బండి సంజయ్ ను ఎందుకు మార్చారో మహేశ్వర్ రెడ్డికి తెలుసా? అని కోమటి రెడ్డి ప్రశ్నించారు.

# కేజ్రీవాల్‌కు మరో ఎదురుదెబ్బ.. పర్సనల్ సెక్రటరీపై వేటు

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అరెస్టై జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. కేజ్రీ వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్ పై వేటు పడింది. అతని నియామక ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ విజిలెన్స్ వెల్లడించింది. ఈ మేరకు బిభవ్‌ను విధుల నుంచి తొలగించింది. ఈ తొలగింపు తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు విజిలెన్స్ స్పెషల్ సెక్రటరీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో ఉన్న ఓ ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేశాడని బిభవ్‌పై 2007లో నోయిడా పోలీసులు కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తమ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అతడు కేజ్రీవాల్‌కు పర్సనల్ సెక్రటరీగా నియమించే సమయంలో ఈ కేసు వివరాలను వెల్లడించలేదని విజిలెన్స్ విభాగం దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపింది. ఈ నియామకంలో అవకతవకలు జరిగాయని గుర్తించినట్లు పేర్కొంది. పాలనావ్యవహారాల పరంగా ఇది ఇబ్బందికర పరిణామం అని, ఎలాంటి ముందస్తు వెరిఫికేషన్ లేకుండా మంత్రుల వ్యక్తిగత సిబ్బందిని నియమించడం సరికాదని విజిలెన్స్



విభాగం తెలిపింది. బిభవ్‌పై నమోదైన అభియోగాలు తీవ్రమైనవని, వాటిపై విచారణ జరుపుతున్నట్లు వెల్లడించింది. ఇదిలా ఉండగా.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బిభవ్ కుమార్‌ను ఈడీ అధికారులు సోమవారం విచారించిన విషయం తెలిసిందే. మనీలాండరింగ్ యాక్ట్ కింద అతడి స్టేట్‌మెంట్‌ను ఈడీ రికార్డు చేసింది. ఈడీ విచారణ అయిన మూడు రోజులకే బిభవ్‌ను విధుల నుంచి తొలగించడం గమనార్హం.

# కిషన్ రెడ్డి జీప్ యాత్ర.. కాంగ్రెస్ వస్తే కర్ఫ్యూ, మతకలహాలు


లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో కిషన్ రెడ్డి జీప్ యాత్ర ప్రారంభించారు. దేశంలో స్థిరమైన పాలన కోసం బిజెపిని గెలిపించాలని కిషన్ రెడ్డి ప్రజలను కోరారు. కాంగ్రెస్ వస్తే కర్ఫ్యూ, మతకలహాలు, అవినీతి కుంభకోణాలు జరుగుతాయని ఆరోపించారు. కాంగ్రెస్ గ్యారంటీల అమలు ఏమైందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ వస్తే.. మళ్లీ కుటుంబపాలన వస్తుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



గరుడ వార్త




# వైసీపీలోకి కేఈ



**కర్నూలు:** మరో వారం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది. అయినా ప్రధాన పార్టీల్లో టికెట్ల పంచాయితీ ఇంకా తేలలేదు. అసంతృప్తులు దారికి రాలేదు. అధినాయకత్వంపై కారాలు మిరియాలు నూరుతూనే ఉన్నారు. అలాంటి సమస్యాత్మక జిల్లాల్లో ఒకటి కర్నూలు. ఇక్కడ టీడీపీకి తలనొప్పులు ఇంకా తగ్గలేదు. కర్నూలు జిల్లాలో తెలుగుదేశం పార్టీకి అండగా ఉంటూ వస్తున్న కెఈ కుటుంబం ఇప్పుడు పార్టీ మారే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. కేఈ ప్రభాకర్‌కు సీటు రాలేదన్న అసంతృప్తితో ఉన్న ఆ ఫ్యామిలీ ఇప్పుడు ఫ్యాన్ వైపు చూస్తున్నట్టు టాక్ నడుస్తోంది. మొదటి నుంచి తెలుగుదేశం పార్టీలో ఉన్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ పార్టీ మారుతున్నారన్న వార్త సంచలనంగా మారింది. దీంతో టీడీపీ అధినాయకత్వం అలర్ట్ అయింది. కేఈ కుటుంబాన్ని బుజ్జగించేందుకు నేతలను రంగంలోకి దింపింది. కేఈతోపాటు ఆయన కుటుంబంతో చర్చించేందుకు కీలక నేతలు రంగంలోకి దిగారని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే గత రెండు రోజులుగా జరుగుతున్న చర్చలు కొలిక్కి రాలేదని సమాచారం. తనకు సీటు ఇవ్వక పోవడంపై కేఈ ప్రభాకర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పుకుంటున్నారు. అందుకే పార్టీ మారేందుకే నిర్ణయం తీసుకున్నారని టాక్ వినిపిస్తోంది. కుటుంబంలో నెలకొన్న భిన్నాభిప్రాయాల కారణంగా పత్తికొండ సీటును తన సోదరుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి కుమారుడు కేఈ శ్యాంబాబుకు కేటాయించాల్సి వచ్చింది. దాంతో ఆయన డోన్ శాసన సభ స్థానాన్ని ఆశించి అక్కడ కార్యాలయం ప్రారంభించడానికి ప్రయత్నించారు. అయితే పార్టీ అందుకు అంగీకరించలేదు. అప్పుడే ఇంటికి ఒక సీటే ఇవ్వాలని పార్టీ నిర్ణయించిందని వివరించారు. సోదరులిద్దరూ ఏకాభిప్రాయానికి వచ్చి ఒక పేరు చెబితే వారికే టికెట్ కేటాయిస్తామని పేర్కొన్నట్లు వెల్లడవుతోంది. తరువాత పార్టీ ప్రకటించిన తొలి జాబితాలో పత్తికొండ శ్యాంబాబుకు, డోన్ స్థానాన్ని కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డికి కేటాయించారు. ఈ టికెట్ల కేటాయింపుపై కేఈ ప్రభాకర్ స్పందించలేదు కానీ డోన్‌లో తాను వ్యతిరేకిస్తున్న సుబ్బారెడ్డికి టికెట్ ఇవ్వకపోవడంతో సంతృప్తి చెందారని అనుకున్నారు. అయితే కొద్ది రోజుల నుంచి మౌనంగా ఉన్న ఆయన పార్టీ మారేందుకు ప్రయత్నాలు ప్రారంభించడంతో టిడిపి చర్చలు జరిపింది. కేఈ ప్రభాకర్ అసంతృప్తిని గుర్తించిన వైసిపి నాయకులు కొందరు ఆయనతో చర్చించి పార్టీలోకి ఆహ్వానించేందుకు రంగం సిద్ధం చేశారని తెలిసింది. ఇందులో కర్నూలు లోక్ సభ స్థానాన్ని కేటాయించేందుకు కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు చర్చ సాగుతోంది. దీనికి ఓకే చెప్పారని కూడా అంటున్నారు. పార్టీ మార్పు మినహా ఇతర అంశాలు చర్చించాలని లేదంటే వెళ్లవచ్చని తెలుగుదేశం పార్టీ నాయకులకు చెప్పేశారట. ఇప్పటికే కర్నూలు లోక్ సభ స్థానాన్ని బివై రామయ్యకు కేటాయించింది వైసీపీ. ఆయన నియోజకవర్గంలో పర్యటిస్తూ పార్టీ నేతలతో ప్రచారం చేసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో కేఈ ప్రభాకర్‌కు టికెట్ ఇస్తే పార్టీలో గందరగోళం నెలకొంటుందని వైసీపీ నేతలు అంటున్నారు. ఈ స్థానాన్ని వాల్మీకులకు కేటాయించడంతో పలువురు నేతలు మౌనంగా ఉన్నారు. ఇప్పుడు ఆ స్థానాన్ని మరో సామాజికవర్గానికి కేటాయిస్తే ఇబ్బందులు వస్తాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కేఈ ప్రభాకర్ పార్టీ మారితే వారి కుటుంబానికి, సామాజిక వర్గానికి చెందిన ఓటు బ్యాంకు ప్రధానంగా ఎటు వెళ్తుందన్న చర్చ సాగుతోంది. మెజారిటీ ఓటర్లు కేఈ వెంట వెళ్తారా లేదా అన్నది లెక్కలు వేస్తున్నట్లు సమాచారం. కేఈ పార్టీ మారకుండా ఉండేందుకు అన్నదమ్ముల మధ్య తలెత్తిన విభేధాల పరిష్కారానికి టిడిపి నేతలే కాకుండా కేఈ సన్నిహితులు కృషి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐక్యంగా ఉంటేనే మంచిదని లేదంటే రాజకీయంగానే కాకుండా ఇతర ఇబ్బందులు తలెత్తే ప్రమాదం లేకపోలేదని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. అన్ని వైపుల నుంచి ఒత్తిడి తీవ్రంగా ఉన్న వేళ కేఈ ప్రభాకర్ ఎలాంటి నిర్ణయాన్ని తీసుకుంటారో అన్న ఆసక్తి నెలకొంది. మొత్తం మీద కేఈ విషయం ఒక్కసారిగా తెరపైకి రావడం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.


# జనసేనకి భారీ షాక్



**నెల్లూరు:** నెల్లూరు జిల్లా జనసేన పార్టీకి భారీ షాక్ తగిలింది. జిల్లా అధ్యక్షుడు మనక్రాంత్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం లాంచనమే.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయ సాయి రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. మనుక్రాంత్ రెడ్డిని వైసీపీలోకి రావాలంటూ ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వానించారు. తన అనుచరులతో చర్చించి సరైన నిర్ణయం తీసుకుంటాను అంటూ మన క్రాంతి రెడ్డి తెలియజేశారు. ఆరు సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడ్డ తనకు సరైన గుర్తింపు దక్కలేదంటూ జనసేన జిల్లా అధ్యక్షుడు ఆవేదన వ్యక్తం చేశారు. మనక్రాంత్ రెడ్డి నివాసానికి విజయ సాయి రెడ్డి తో పాటు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్ రెడ్డి నెల్లూరు పట్టణ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ ఉన్నారు.

# ఆ లక్ష్యాన్ని బీజేపీ సాధించగలదా...?

'జూన్ 4, 400 సీట్లు' లక్ష్యం పెట్టుకున్న భారతీయ జనతా పార్టీ తన ప్రచార వెల్లువలో తానే కొట్టుకుపోతున్నట్లు కనిపిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ప్రచారం ప్రారంభించిన తర్వాత దాన్ని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేదు. 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' (ఈసారి 400 దాటుతాం) అన్న నినాద హోరులో బీజేపీ కార్యకర్తలు మోదీ సునామీ దేశాన్ని ముంచేస్తోందా అన్న స్థాయిలో ప్రచారం సాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాల్లో జరిగిన సభల్లో మోదీ స్వయంగా ఎన్డీఏ 400 సీట్లకు పైగా సాధిస్తుందని ప్రకటించారు. ఇక, బీజేపీ ఒక్కటే 370 సీట్లు గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. బీజేపీ పోటీ చేస్తున్న 450 సీట్లలో 370 సీట్లు అంటే 82 శాతం సీట్లు గెలుచుకోవాలన్న మాట. ఇప్పటివరకూ బీజేపీ పోటీ చేసిన సీట్లలో అత్యధికంగా 70 శాతం సీట్లు 2019లోనే సాధించింది. అప్పుడు 436 సీట్లకు పోటీ చేసి 303 గెలుచుకుంది. ఎన్డీఏ 400 సీట్లు దాటడం మాట అటుంచితే, ఇప్పుడు బీజేపీ 82 శాతం సీట్లు ఎలా సాధించగలుగుతుంది అన్నది మిలియన్ డాలర్ ప్రశ్న. ఈ ప్రశ్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా వేసుకుని ఉంటారు. మెజారిటీ రాష్ట్రాల్లో బీజేపీకి అత్యధిక సీట్లు నాడు లభించాయి. ఈసారి అంతకంటే ఎక్కువ లభిస్తే కాని బీజేపీ తన లక్ష్యాన్ని చేరుకోలేదు. సాధారణంగా రాజకీయ నాయకులు అరచేతిలో స్వర్గం చూపించేందుకు అందమైన అబద్ధాలు చెబుతూ ఉంటారు. మోదీ ప్రకటన కార్యకర్తల్లోనూ, ప్రజల్లోనూ ఒక ఊపు తెచ్చేందుకో, ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసి మీడియాను కూడా భ్రమల్లో ముంచేందుకో చేసిందని చెప్పడానికి వీల్లేదు. అన్ని వ్యవస్థల్నీ అదుపులో పెట్టుకుని, ప్రతి చర్యా పకడ్బందీగా తీసుకుంటూ, ప్రతిపక్షాల్ని అణిచివేయడం ద్వారా తాననుకున్నది సాధించగలననే ధీమా ఆయనలో కనిపిస్తున్నది. మోదీ ప్రతి ఒక్క లెక్కా ప్రణాళికాబద్ధంగా వేసుకున్నదే. ఫిబ్రవరి 18న ఆయన బీజేపీ జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ప్రసంగిస్తూ వచ్చే 100 రోజులు పార్టీకి కీలకమని, క్షణం కూడా వృధా చేయకుండా మళ్లీ అధికారంలోకి బ్రహ్మాండమైన మెజారిటీతో తిరిగి రావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అంటే వంద రోజులలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి కాదని ఫిబ్రవరి 18నే మోదీకి తెలుసని అర్థం. నిజానికి గత మూడు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మే రెండో వారంలోనో, మూడో వారంలోనో వచ్చాయి. కాని ఈ సారి ఉద్దేశపూర్వకంగా జూన్ మొదటి వారంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే విధంగా ఎన్నికల కమిషన్ షెడ్యూలు ప్రకటించింది. మోదీ అధికారిక పర్యటనలన్నీ ముగించుకున్న తర్వాత ఆయన వ్యూహరచనకు అనుగుణంగా, ఇక పొడిగించడం అసాధ్యమని అనుకున్నప్పుడే ఎన్నికల ప్రక్రియను ప్రకటించారనుకోవచ్చు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం వల్ల ప్రయోజనం ఉంటుందా అన్న అనుమానాలు చాలామందికి ఉన్నాయి. తెలంగాణలో మోదీ పర్యటించిన రోజే కేసీఆర్ కుమార్తె కవితను ఢిల్లీ మద్యం కేసులో అరెస్టు చేశారు. సరిగ్గా వారం రోజులకు ప్రధాని భూటాన్‌లో ఉన్నప్పుడు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. బహుశా కవిత అరెస్టు మూలంగా పెద్దగా సానుభూతి వచ్చే అవకాశాలు లేవని, కేసీఆర్ ఆత్మరక్షణలో పడినందువల్ల బీజేపీ బలోపేతం అవుతుందని ఆయనకు సమాచారం వచ్చే ఉంటుంది. ఇక కేజ్రీవాల్ అరెస్టు వల్ల వచ్చే రాజకీయ పర్యవసానాలను ఎదుర్కోవడానికి కూడా ముందే సిద్ధమై ఉంటారు. 2014లో ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 10న జరిగితే, 2019లో మే 12న జరిగాయి. ఈసారి ఢిల్లీ ఎన్నికలను ఆశ్చర్యకరంగా ఆరవ దశలో మే 25న నిర్ణయించారు. అంటే కేజ్రీవాల్ అరెస్టు జరిగిన రెండు నెలలకు ఢిల్లీలో ఎన్నికలు జరుగుతున్నాయన్నమాట. ఢిల్లీలో పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి ఈ మాత్రం సమయం చాలునని నరేంద్రమోదీ అనుకుని ఉంటారు. ఢిల్లీలో గత ఎన్నికల్లో ఏడుకు ఏడుసీట్లు గెలిచిన బీజేపీ ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ చేతులు కలపడంతో కలవరానికి గురయినట్టుంది. కేజ్రీవాల్‌ను అరెస్టుచేయడం ద్వారా ఆప్‌ను చితక్కొట్టడానికి, కనీసం ఇతర రాష్ట్రాల్లో ఆప్ ప్రభావాన్ని అడ్డుకోవడానికి వ్యూహరచన జరిగి ఉంటుంది. ఢిల్లీ ఎన్నికల షెడ్యూలే కాదు, ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల తేదీలు కూడా బీజేపీ వ్యూహరచనకు అనుగుణంగా ఉన్నాయి. బీజేపీ పెద్దగా ప్రభావం చూపలేని తమిళనాడు, కేరళ ఎన్నికలు మొదటి రెండు దశల్లోనే పూర్తి కాగా బీజేపీ పోరాడగలిగే రాష్ట్రాల్లో ఎన్నికలను వివిధ దశల్లో చివరి వరకూ నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో భౌగోళిక సామీప్యతను అంతగా పట్టించుకోలేదు. దక్షిణాది రాష్ట్రాల్లో ఆశించినన్ని ఫలితాలు వస్తాయా అన్న చర్చ బీజేపీలో జరుగుతోంది. కాంగ్రెస్‌కూ, బీజేపీకీ మధ్య ముఖాముఖి పోటీ జరిగితే బీజేపీదే పై చేయి అవుతుందని మోదీ భావన. ఇది ఇతర రాష్ట్రాలలో వర్తిస్తుందేమో కాని తెలంగాణలో మాత్రం సాధ్యం కాదు. తెలంగాణలో ఇటీవలే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దూకుడును తట్టుకొని బీజేపీ ప్రభంజనం వీచేలా చూడడం అంత సులువు కాదు. మోదీ ఎంత బలవంతుడైనా స్థానిక నేతలు బలంగా లేకపోతే విజయం సాధించడం కష్టం. అందుకే చివరి నిమిషంలో ఇతర పార్టీ నేతల్ని, వ్యాపారస్తుల్ని లాగి వారికి అప్పటికప్పుడే సీట్లు ఇస్తున్నారు. ఆ నేతల విశ్వసనీయత, బీజేపీ సిద్ధాంతాల పట్ల వారి చిత్తశుద్ధి దేవుడెరుగు. కాని వారు బీజేపీని ఆదుకుంటారన్న ఆశ మోదీలో బాగా ఉన్నట్లు కనపడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఆరు సీట్లకు పోటీ చేస్తున్న బీజేపీ తెలుగుదేశం గెలిపిస్తే కాని స్వంతంగా ఒక్కసీటు కూడా గెలిచే అవకాశాలు లేవు. కేరళలో కేంద్ర మంత్రులతో పోటీ చేయించినా ఖాతా తెరుస్తుందా అన్నది అనుమానమే. కర్ణాటకలో కూడా బీజేపీ గత ఎన్నికల్లో 28కి 26 సీట్లు గెలిచినా ఈసారి అన్నిసీట్లు గెలవడం సాధ్యపడదని బీజేపీకి సమాచారం వచ్చినట్లుంది. అందువల్లే అక్కడ యడ్యూరప్పకు మళ్లీ ప్రాధాన్యత పెంచారు. అక్కడ బీజేపీలో అంతర్గత తగాదాలు, జేడీ(ఎస్) సీట్ల పంపిణీ వల్ల ఏర్పడిన అసంతృప్తి గురించి ఢిల్లీకి సమాచారం అందుతూనే ఉన్నది. ఈ క్రమంలో మైనింగ్ వ్యాపారి గాలి జనార్దన రెడ్డి పార్టీని కూడా బీజేపీలో విలీనం చేసుకోవాల్సి వచ్చింది. 2023




అసెంబ్లీ ఎన్నికల్లో కల్యాణ కర్ణాటక ప్రాంతంలో గాలి జనార్దన్ రెడ్డి స్థాపించిన 'కల్యాణ రాజ్య ప్రగతి పక్ష' పార్టీ వల్ల బీజేపీకి వచ్చిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయనను బీజేపీలో చేర్చుకోవల్సివచ్చిందని అంటున్నారు. గాలి అప్పుడు గంగావతి నుంచి విజయం సాధించారు. 'నీ రాజకీయ భవిష్యత్ బీజేపీలోనే ప్రారంభమైంది. నీవు వెంటనే పార్టీలో చేరిపో' అని హోంమంత్రి అమిత్ షా చెప్పడంతో తాను తన పార్టీని బీజేపీలో విలీనం చేశానని గాలి జనార్దన్ రెడ్డి చెప్పారు. గాలి జనార్దన్ రెడ్డి అక్రమ మైనింగ్ గురించి, చేసిన దారుణాల గురించి 2011లో అప్పటి లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే ఇచ్చిన నివేదికతో గాలి పతనం ప్రారంభమైంది. బళ్లారి గనుల నుంచి చైనాకు టన్నుకు రూ. 6500 నుంచి రూ. 7000 చొప్పున ధరకు ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేశారని, రాష్ట్రానికి రూ. 27 మాత్రమే రాయల్టీగా చెల్లించారని హెగ్డే వెల్లడించారు. గాలి జరిపిన 35 వేల కోట్ల అక్రమ మైనింగ్ గురించి, ఆయనపై సీబీఐ చేసిన ఆరోపణల గురించి, సాక్షులకు బెదిరింపులు, న్యాయమూర్తులకు ప్రలోభాల గురించి పత్రికల్లో నాడు వందలాది పేజీల కథనాలు వస్తే మాత్రం ఏమి జరిగింది? ఆయనపై విచారణ ముగించమని సుప్రీంకోర్టు పలుసార్లు ఆదేశించినప్పటికీ ఫలితం లేకపోయింది.

# నిధుల పంపిణీ... సుప్రీం చెప్పే వరకూ ఆగాలా...

ఫెడరల్ వ్యవస్థలో కేంద్రమూ,రాష్ట్రాలూ పోటీదా రులు కావు.రాష్ట్రాల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది.అసలు ఫెడరల్ వ్యవస్థ అం టేనే అది.కానీ, కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందంటూ రాష్ట్రాలు చాలా కాలంగా ఫిర్యాదుచేస్తున్నాయి. విసిగి వేసారినట్టు అవి ఇప్పుడు సుప్రీంకోర్టుకు వెళ్ళాయి. దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష చూపుతోందంటూ కేరళ, తమి ళనాడు,కర్నాటక దాఖలు చేసిన పిటిషన్లను పురస్క రించుకుని కేంద్రానికి హితవచనాలతో సుప్రీంకోర్టు జ్ఞానబోధ చేసింది. సుప్రీంకోర్టు చేత ఇలా చెప్పిం చుకోవడం కేంద్రానికి చిన్నతనమే. సాధారణ నిధుల విషయంలోనే కాకుండా, ప్రకృతివైపరీత్యాలు సంభ వించినప్పుడు ఇచ్చే నిధుల విషయంలోనూ కేంద్రం జాప్యం చేస్తోందని కేరళ ఫిర్యాదు చేసింది. కర్నాట కనుద్దేశించి కోర్టు ప్రధానమంత్రిని కలిసి నిధుల కోసం అర్జీ పెట్టుకోవాలని సూచించింది. దానిపై కర్నాటక ప్రభుత్వం కోర్టుకు దాఖలు చేసిన అఫిడవిట్‌లో%ా% కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం ఆరు మాసాల క్రితం ఢిల్లీ%ి% వెళ్ళి ప్రధానికి మహజరు సమర్పించిన సంగతిని గుర్తు చేసింది.ఒక వంక ప్రధానమంత్రి దక్షిణాది రాష్ట్రాల్లో ఓట్ల కోసం ర్యాలీల్లో ప్రసంగిస్తున్న సమయంలోనే ఇది చోటు చేసుకోవడం గమనార్హం. రాజ్యాంగంలోని సూత్రాల ప్రకారం రాష్ట్రాలకు నిధుల కేటాయింపు జరగాల్సి ఉండగా,కేంద్రం వివక్ష చూపుతోందంటూ దక్షిణాది రాష్ట్రాలు ఆరోపించడం శోచనీయం. కర్నాటకకు కరవు నిధుల అంశం పార్లమెంటు కడపటి స మావేశాల్లో కూ డా ప్రస్తావనకు వచ్చింది. కర్నాటక కాంగ్రెస్ ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ సోద రుడు,కాంగ్రెస్ ఎంపీ డికే సురేష్ ఆగ్రహంతో ఊగి పోతూ విడిపోతేనే దక్షిణాదికి న్యాయం జరుగు తుందేమోనంటూ చేసిన వ్యాఖ్య పెద్ద దుమారం రేపింది. ఆయన వ్యాఖ్యను ఖం డించడానికి కమలనా థులు జట్టుకట్టినట్టు ముందుకు వచ్చారు.ఆయన అలాంటి వ్యాఖ్య చేయడం పొరపాటే కానీ, అప్పటి నుం చి ఇంతవరకూ కేంద్రం నిధుల విష యంలో స్పందిం చలేదని కర్నాటక నాయకులు విమ ర్శిస్తున్నారు. అసలు కరవు నిధుల పంపిణీ విధానమే లోపభూయిష్టంగా ఉందని కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ విమ ర్శించారు. కేంద్రమూ, రాష్ట్రాల మధ్య నిధుల పంపిణీ అనేది ప్రణాళికా సం ఘం సూచనల మేరకు గతంలో జరిగేది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రణాళికా సంఘం స్థానే నీతి ఆయోగ్ అనే సంస్థను నెలకొల్పారు. ఆ సంస్థకు ఉపాధ్యక్షు డు,ఇతరయంత్రాంగం ఉన్నా, కర్త,కర్మ,క్రియ అంతా ప్రధానే. ఆయన చెప్పినరీతిలోనే నిధుల కేటాయిం పు ,నిర్ణయాలు జరుగుతాయని విజయన్ ఆరోపించారు. కేరళకు రెండేళ్ళక్రితం సంబం భవించిన తుపాను నిధులు ఇంకా అందలేదన్నారు. తమ ఆర్థిక వ్యవస్థ వి ధ్వంసానికి కేంద్రం కారణమవుతోందని ఆయన చాలా తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ తొలిముఖ్య మంత్రి కే చంద్రశేఖరరావు కూడా ఈ విషయంలో కేంద్రం అనుస రిస్తున్న విధానాన్ని గతం లో పలుమార్లు తప్పు పట్టారు. కేంద్రం కేవలం దక్షిణా దిరాష్ట్రాల పట్లే ఈ వివక్షను ఎందుకు చూపుతోందని కేరళ, కర్నాటక, తమిళనాడు ముఖ్య మంత్రులు ప్రశ్నిస్తు న్నారు.

దక్షిణాదిలో బీజేపీ అధికారంలో లేకపోవడం వల్లనె మోనంటూ వారే వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నికల వేళ ఈ అంశం ప్రధాన రాజకీయాస్త్రంగామారింది. దీనిపై దక్షిణాది పర్యటనలో ప్రధాని వివరణలు ఇచ్చు కుంటూ ముం దుకు సాగుతున్నారు.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ దక్షిణాదికి చెందిన వారే అయినా ఆమె ఈ విషయంలో నిస్సహాయరాలుగా ఉన్నట్టు కనిపి స్తోంది. మోడీ తొలివిడత ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా వ్యవహ రించిన అరుణ్‌జైట్లీ కూడా ఇదే మాదిరి నిస్స హాయతను ప్రకటించేవారు. వీరిద్దరూ రాజకీయంగా బలం లేని వారే. రాజ్యసభ ఎంపీలుగా కేంద్రంలో అత్యం త కీలకమైన ఆర్థిక శాఖను నిర్వహించడంవీరిలో ఉమ్మ డిగా కనిపించే లక్షణం. అంతకుముందు యూ పీఏ ప్రభు త్వంలో కూడా చిదంబరం ఆర్థిక మంత్రిగా ద క్షిణా దికి చేసిందేమీ లేదు. ఎంపీల సంఖ్య,రాబడి దామాషాల ప్రకారం దక్షిణాదికి రావల్సినన్ని నిధులు రావడం లేదన్న ఫిర్యాదులు చాలా కాలంగా వినవస్తు న్నాయి. కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతోందని తమి ళనాడు, కేరళ సూటిగానే ఆరోపించాయి. ఈ పరి స్థితుల్లో వారి అసంతృప్తిని చల్లార్చాల్సిన బాధ్యత కేం ద్రంపై ఉంది. కనీసం ఎన్నికల ముందయినా దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

# అలవికాని వాగ్దానాలు...చేటే!

లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నాడు ఎన్నికల ప్రణాళిక (మ్యానిఫెస్టో)ని న్యాయపత్ర పేరిట విడుదల చేసింది. 24పేజీల ఈ ప్రణాళికలో కాంగ్రెస్ తమ పార్టీ అధికారంలోకి వస్తే అమలు జేయబోయే పథకాలనూ,కార్యక్రమాల గురించి సవివరంగా తెలియజేసింది. ముఖ్యంగా, ప్రజలకు ఐదుగ్యారంటీలను ఇచ్చింది.ఈ ప్రణాళిక లో ఐదు న్యాయాలు ఉన్నాయి. యువకులు, మహిళలు, రైతు లు, శ్రామికులు,అల్పసంఖ్యాక వర్గాల కు న్యాయం చేకూ రుస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.ఈ ప్రణాళికలో కొత్త దనం ఏమీ లేదు.

కర్నాటక,తెలంగాణ అసెంబ్లి ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలనే ఇందులో పొందు ప ర్చారు. ఆ గ్యారంటీల వల్ల ఆ రెండు రాష్ట్రాలలో పార్టీకి ప్రజలు పట్టం కట్టడం వల్ల వాటిపై సెంటిమెం ట్‌తోనే ఈ ప్రణాళికలో చేర్చి ఉంటారు. మాజీ కేంద్ర ఆర్థికమంత్రి పి.చిదంబరం నేతృత్వంలో మ్యానిఫెస్టో కమిటీ దీనిని రూపొందించింది.ఈ దేశాన్ని ఎక్కువ కాలం పరిపా లించిన కాంగ్రెస్ ఇప్పుడు సరికొత్తగా వాగ్దానాలను ఇవ్వాల్సిన అవసరం లేదు.కానీ, ఎన్నికల ముందు మ్యానిఫెస్టోని విడుదల చేయడం ఆనవాయితీ కనుక విడుదల చేశారు.ఎన్నికల ప్రణాళిక అనేది ఒక నమూనా మాత్రమే. దానిని మించి కార్యక్రమాలనూ, పథకాలను అమలు జేసిన ప్రభుత్వాలు ఉన్నాయి. ప్రజలకు ఆ విషయంలో నమ్మకం కుదిరితే ఈ వాగ్దానాల గురించి పట్టించుకోరు.ఈ ప్రణాళికలో పేర్కొన్న వర్గాలే కాకుండా ఇంతవరకూ ఎటువంటి సాయం పొందని వర్గాలు సమాజంలో అనేకం ఉన్నాయి. ఎన్నికల ముందు విడుదల చేసే ప్రణాళికలను అధికారంలోకి వచ్చిన తర్వాత చాప చుట్టేయడం వల్లనే వాటికి విలువ తగ్గిపోతోంది.పార్టీల ప్రతిష్ట దిగజారుతోంది.తమ పార్టీ అధికారంలోకి వస్తే కులగణనను అమలు జేస్తామని ఈ ప్రణాళికలో కాంగ్రెస్ వాగ్దానం చేసింది.

కులగణన అనేది మాజీ ప్రధానులైన నెహ్రూ, ఇందిరాగాంధీల సిద్ధాంతాలకు వ్యతిరేకమని పార్టీ సీనియర్ నాయకుడు ఆనంద్ శర్మ ఇప్పటికే విమర్శించారు.అలాగే, రిజర్వే షన్ల పరిధిని 50 శాతం మించి పొడిగిస్తామంటూ కాంగ్రెస్ వాగ్దానం చేసింది.ఇది అమలు చేయడం అంత సులభం కాదు. ఎందుకంటే,రిజర్వేషన్ల పరిమితిని పెంచాలంటే రాజ్యాంగ సవరణ అవసరం.రాజ్యాంగ స వరణ చేయాలంటే కాంగ్రెస్‌కి పార్లమెంటులో మూడిం ట రెండు వంతుల మెజారిటీ రావాలి. ప్రస్తుత పరిస్థితిలో అంత పెద్ద మెజారిటీ ఆ పార్టీకి వచ్చే అవకాశం లేదు.ఆ పార్టీ పోటీ చేస్తున్నదే నాలుగువందల సీట్ల లోపు.

# తమిళనాట హోరెత్తిన ప్రచారం.....



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల మొదటి దశ పోలింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రచారంలో మునిగి తేలుతున్నాయి. నేతల పరస్పర విమర్శలు, సవాళ్లతో రాజకీయ వేడి, వేసవి వేడిని మించిపోయింది. భిన్నమైన రాజకీయాలకు నిలయమైన తమిళనాడులోని 39 లోక్‌సభ స్థానాలకు మొదటి దశలోనే (ఏప్రిల్ 19న) ఎన్నికలు జరగనున్నాయి. ప్రధానంగా అధికార డిఎంకె నేతత్వంలోని ఇండియా ఫోరం, ప్రతిపక్ష అన్నాడిఎంకె కూటమి, బిజెపి నేతత్వంలోని ఎన్‌డిఎ కూటమి పోటీ చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సమాఖ్య వాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని బలపరుస్తూ ఇండియా ఫోరం ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ప్రతిపక్ష అన్నాడిఎంకె కూటమి కేంద్రం జోలికి పోకుండా కేవలం డిఎంకె ప్రభుత్వ పాలనపైనే విమర్శలు గుప్పిస్తూ ప్రచారం చేస్తోంది. బిజెపి కూటమి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, హిందూత్వాన్ని ప్రచారం చేస్తూ ఎన్నికల బరిలోకి దిగింది. జయలలిత మరణం తరువాత, శశికళ జైలు పాలైన తరువాత అధికార అన్నాడిఎంకెలో సంక్షోభం చోటు చేసుకుంది. ఎప్పటి నుంచి తమిళనాడు రాజకీయాల్లో జోక్యం చేసుకోవాలని బిజెపి ఆత్రపడగా, ఈ పరిణామంతో అన్నాడిఎంకె నేతలు మోడీ, షాల వద్దకు ప్రదక్షిణాలు చేశారు. దీంతో తమిళనాడు బిజెపి చేతుల్లోకి వెళ్లింది. ఈ పరిణామాలను సునితంగా పరిశీలించిన తమిళ ప్రజలు అదును చూసి, అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడిఎంకె, బిజెపి కూటమికి గట్టిదెబ్బకొట్టారు. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపితో కలిసి పోటీ చేసిన అన్నాడిఎంకె తన వైఖరిని మార్చుకుని, ఎన్‌డిఎ కూటమి నుంచి బయటకు వచ్చింది. బిజెపితో కలిసి వెళ్తే తమకు పరాభవం తప్పదని భావించిన అన్నాడిఎంకె, బిజెపితో తెగదెంపులు చేసుకుంది.

## ఆప్ మంత్రులు బాధ్యతగా వ్యవహరించట్లేదు



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ), ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం మధ్య మరో వివాదం రాజుకుంది. పాలనాపరమైన వ్యవహారాల్లో ఢిల్లీ మంత్రులు సహకరించడం లేదని ఎల్‌జీ వీకే సక్సేనా ఆరోపించారు. ఆయా శాఖల పనితీరుపై చర్చించేందుకు సమావేశాలకు పిలిస్తే.. మంత్రులు సాకులు చెబుతూ గైర్హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఫిర్యాదు చేస్తూ కేంద్ర హోం శాఖకు లేఖ రాశారు. ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టయి సీఎం అరవింద్ కేజ్రీవాల్ జైల్లో ఉన్న వేళ ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. "సీఎం కేజ్రీవాల్ అరెస్టు, తదనంతర పరిణామాల నేపథ్యంలో.. ఢిల్లీలో రోజువారీ కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూసేందుకు మంత్రులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరపడం అవసరం. ప్రజారోగ్యం, వేసవి కార్యాచరణ ప్రణాళికపై చర్చించేందుకు ఈ నెల 2న సమావేశానికి పిలిచినప్పటికీ.. మంత్రులు గోపాల్‌రాయ్, కైలాశ్ గహ్లోత్, ఆతిశీ, సౌరభ్ భరద్వాజ్‌లు ఎన్నికల నియమావళిని సాకుగా చూపుతూ హాజరవలేదు. వారు బాధ్యతగా వ్యవహరించడం లేదు. స్థానికుల రోజువారీ జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై వారి నిర్లక్ష్య వైఖరికి ఇది అద్దం పడుతోంది" అని ఎల్‌జీ పేర్కొన్నారు.

## బొలెరో వాహనం లోయలో పడి 8 మంది మృతి



**ఉత్తరాఖండ్ :** ఉత్తరాఖండ్‌లో అర్ధరాత్రి ఘోర ప్రమాదం జరిగింది. బొలెరో వాహనం అదుపుతప్పి 200 మీటర్ల గుంతలో పడటంతో అక్కడికక్కడే ఏడుగురు మృతిచెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. జల్ జీవన్ మిషన్ కింద పని చేయడానికి నేపాల్ మూలానికి చెందిన 10 మందిని తనక్‌పూర్‌కు తీసుకెళ్లారు. వీరంతా ఉంచకోట్‌కు వచ్చారు. పనులు పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి బొలెరో వాహనంలో వెళుతుండగా, ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్ జిల్లాలోని బేతాల్‌ఘాట్ డెవలప్‌మెంట్ బ్లాక్‌లోని ఉంచకోట్ ప్రాంతంలో వాహనం అదుపుతప్పి 200 మీటర్ల లోతైన గుంటలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. వాహనం పడిపోయిన శబ్దం విని చుట్టుపక్కల వారు సంఘటనాస్థలికి పరుగులు తీశారు. అనంతరం పోలీసులకు, అధికారులకు సమాచారం అందించారు. స్థానికుల సహాయంతో పోలీసులు బాధితులను రక్షించారు. గాయపడినవారందరినీ వెంటనే ఆసుపత్రికి తరలించారు. చీకటి సమయం కావడంతో సహాయ చర్యలకు తీవ్ర ఇబ్బందులు ఎదురైనట్లు పోలీసులు తెలిపారు. మొత్తంగా డ్రైవర్‌తో సహా 8 మంది మఅతి చెందినట్లు నిర్ధారించారు. మఅతులు రామ్ చౌదరి (50), ధీరజ్ (45), అనంత్ రామ్ చౌదరి (40), వినోద్ చౌదరి (38), ఉదరు రామ్ చౌదరి (55), తిలక్ చౌదరి (45), గోపాల్ (60). శాంతి చౌదరి, ఛోటూ చౌదరిగా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భారత వ్యతిరేక కథనంపై స్పందించిన అమెరికా



న్యూయార్క్: పాకిస్తాన్‌లో వరుస ఉగ్రవాదల మిస్టరీ మరణాల వెనుక భారత్ హస్తం ఉందని ఇటీవల యూకేకు చెందిన ఓ వీడియా సంస్థ ఆరోపణలు చేస్తూ కథనం వెల్లడించింది. అయతే తాజాగా ఆ కథనంపై అగ్రరాజ్యం అమెరికా స్పందించింది. ఇటువంటి ఆరోపణలను తీవ్రతరం చేసుకోకుండా ఇరు దేశాలు.. చర్చల ద్వార సమస్యను పరిష్కరించుకోవాలని పేర్కొంది. భారత్‌పై వచ్చిన ఆరోపణలపై ఆమెరికా వైఖరి ఏంటని అడిగిన ప్రశ్నకు యూఎస్ విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ స్పందించారు. 'పాకిస్తాన్‌లోని వరుస ఉగ్రవాదుల మిస్టరీ హత్యల వేనుక భారత్ హస్తం ఉందని వెలువడిన కథనం మా దృష్టికి వచ్చింది. అటువంటి ఆరోపణలపై మేము ఎటువంటి వ్యాఖ్యలు చేయిలేం. మేము ఇరు దేశాలకు సంబంధించి సున్నితమైన విషయంలో జోక్యం చేసుకోలేం. అదే విధంగా ఇటువంటి ఆరోపణలను ఇరు దేశాలు సైతం తీవ్రతరం చేసుకోకుండా సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి' అని మాథ్యూ మిల్లర్ అన్నారు. 2019 పుల్వావా దాడుల అనంతరం విదేశాల్లో ఉండే ఉగ్రవాదులను హతమార్చే విధానాలను భారత్ పాటిస్తోందని యూకేకు చెందిన 'దీ గార్డియన్' న్యూస్‌పేపర్ ఓ నివేదిక వెల్లడించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఇప్పటి వరకు భారత విదేశీ ఇంటెలిజెన్స్ సంస్థ 'రా' సుమారు 20 హత్యలు చేయించి ఉంటుందని ఆరోపణలు చేసింది. భారత్, పాక్ ఇంటెలిజెన్స్ అధికారాలు ఇచ్చిన సమాచారం మేరకే తాము ఈ నివేదిక వెల్లడించామని గార్డియన్ పత్రిక పేర్కొనటం గమనార్హం.

## ఆరు నెలల శిక్షణతో 'చైనా' సైనికుడితో పోరాడలేరు



భోపాల్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకంపై రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. కేవలం ఆరునెలలు శిక్షణ తీసుకున్న 'అగ్నివీర్'.. ఐదేళ్లు శిక్షణ పొందిన చైనా సైనికుడితో పోరాడలేరని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని షాదోల్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రసంగించిన రాహుల్ గాంధీ.. ప్రధానమంత్రి రూపొందించిన ఈ పథకాన్ని భారత ఆర్మీ కోరుకోవడం లేదన్నారు. "గతంలో పేదలు సైన్యంలో చేరేవారు. పెన్షన్‌తోపాటు ఇతర హోదా పొందేవారు. క్యాంటీన్ సౌకర్యం కూడా ఉండేది. కానీ, ఇప్పుడు అగ్నివీరులను తయారు చేస్తున్నామని, వారికి ఆరు నెలల శిక్షణ ఇస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. చైనా సైనికులు మాత్రం ఐదేళ్ల శిక్షణ పొందుతున్నారు. ఫలితం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ అమరుడైతే 'అగ్నివీర్' అయినందువల్ల అమరవీరుడి హోదా కూడా లభించదు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తాము కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేస్తామని రాహుల్ గాంధీ వెల్లడించారు. ఇదే విషయాన్ని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ పొందుపరిచామన్నారు.

## ఇజ్రాయెల్ సేనల ఉపసంహారణ....

## శిథిల ఖాన్ యూనిస్‌కు తిరిగొస్తున్న పాలస్తీనీయులు



దక్షిణ గాజాలో ఖాన్ యూనిస్ ప్రాంతం నుంచి తమ సైన్యాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ఇజ్రాయెల్ రక్షణ దళాలు ప్రకటించాయి. దీంతో కొన్ని నెలలుగా తమ నివాసాలకు దూరంగా తలదాచుకున్న వేల కుటుంబాలు సొంత గూటికి తిరుగు పయనమయ్యాయి. నగరంలో ప్రస్తుతం ఎటుచూసినా విధ్వంసమే కనిపిస్తోంది. పాఠశాలలు, ఆసుపత్రులు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. ఒకప్పుడు అపార్టుమెంట్లు, భారీ భవంతులు, వాణిజ్య సముదాయాలతో కళకళలాడిన ఖాన్ యూనిస్.. ఇజ్రాయెల్ సేనల దాడులతో నామరూపాల్లేకుండా పోయింది. ఈ నగర జనాభా 14 లక్షలు. గాజా జనాభాలో సగం ఇక్కడే ఉండేది. గత అక్టోబర్ 7న గాజాపై యుద్ధం మొదలుపెట్టిన ఇజ్రాయెల్.. డిసెంబర్‌లో ఖాన్ యూనిస్‌పైకి సేనలను పంపించింది. హమాస్ ఉగ్రవాదులకు కీలక స్థావరంగా ఉన్న ఈ నగరాన్ని జల్లెడ పట్టింది. బందీలుగా చేసుకున్న వారిని ఈ నగరంలోనే దాచిపెట్టినట్లు భావించిన ఇజ్రాయెల్ సైన్యం.. ముష్కరులు తలదాచుకున్నట్లు అనుమానించిన సొరంగాలను ధ్వంసం చేసింది. ఈ క్రమంలో అక్కడి ప్రధాన ఆసుపత్రిపైనా దాడులు చేసింది. ఈ ఆపరేషన్‌లో వేలమంది హమాస్ ఉగ్రవాదులు హతమైనట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. అయితే, దాడుల నేపథ్యంలో లక్షల మంది స్థానికులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. నగరం నుంచి తమ బలగాలను ఉపసంహరించుకుంటున్నట్లు తాజాగా ఇజ్రాయెల్ ప్రకటించిన వెంటనే.. సైకిళ్లు, నడక మార్గంలో వేల మంది ఇంటిబాట పట్టారు.

## మోడీ భజనలో ఉత్తరాది మీడియా...!


పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ దేశ వ్యాప్తంగా భిన్న వర్గాల నుండి మోడీ పదేళ్ల పాలనపై విశ్లేషణ ఎక్కువైతున్నది. ఆయన పాలన కొనసాగాలని కోరేవాళ్లకన్నా మరో ఐదేళ్లు ఆయనే ప్రధానిగా ఉంటే దేశంలో సామాజిక న్యాయం, రాజ్యాంగ భద్రత ఇంకెంత దెబ్బ తింటాయో, నచ్చనివారిపై వ్యవస్థల దుర్వినియోగం ఎలా విరుచుకుపడుతుందో అనే బెంగ వాటిలో ప్రస్ఫుటమవుతోంది. నిజానికి ప్రస్తుతం బిజెపి ఏలుబడి గురించి ఉన్నదున్నట్లుగా రాసే పత్రికలు తక్కువే. మోడీకి దాసోహమైన పత్రికల నుండి, టివి ఛానళ్ల నుండి వెళ్లిపోయిన రాజకీయ విశ్లేషకులు సొంతంగా యూ ట్యూబ్ ఛానళ్లు తెరిచి తమ ఘోషను వినిపిస్తున్నారు. బెదిరింపులకు, కేసులకు లొంగకుండా తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్న వారి సాహసానికి సలాం కొట్టాల్సిందే. అయితే అవి సామాన్యుల దాకా చేరవు. ఓట్లపై వాటి ప్రభావం తక్కువే ఉంటుంది. దక్షిణ భారతంలో కాషాయ పాలన లేనందున ఇక్కడి ప్రభుత్వాలు పత్రికలకు కాస్త నోరు విప్పే అవకాశాన్ని ఇస్తున్నాయి. తెలుగు పత్రికలు చాలా మట్టుకు ప్రాంతీయ పార్టీలకు వత్తాసుగా నిలుస్తున్నా జాతీయ స్థాయిలో బిజెపి, కాంగ్రెస్‌లపై విమర్శలకు అడ్డేమీ చెప్పడం లేదు. అయితే దేశ వ్యాప్తంగా వెళ్లే ఇంగ్లీషు పత్రికలు, వాటి ఆన్‌లైన్ ఎడిషన్లు, ఇంగ్లీషు, హిందీ ఛానళ్లు బహిరంగంగా మోడీ భజన చేస్తున్నాయని తెలుస్తోంది. కొన్ని యూ ట్యూబ్ ఛానళ్లలో మోడీ పాలనపై వాస్తవిక సామాజిక విశ్లేషణ జరుగుతుండగా ప్రధాన మీడియాలో మాత్రం పెద్ద సంఖ్యలో ఆయనకు అనుకూలంగా మాట్లాడేవారిని పిలిపించి వ్యతిరేకంగా మాట్లాడే గొంతులను నొక్కేలా, ఎద్దేవా చేసేలా కార్యక్రమాలను నిర్మిస్తున్నారు. ఈ రకంగా చూస్తే మోడీ మూడోసారి ప్రధాని పీఠంపై కూచోగానే దేశంలో భారీ మార్పులు జరిగే అవకాశం కనబడుతోంది. అంబేద్కర్‌కు దండం పెడుతూనే రాజ్యాంగాన్ని మార్చే చట్టాలు వచ్చేట్లున్నాయి. భిన్న సామాజిక వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లు పలుచబడేలా 10% ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు ప్రవేశపెట్టినా ఎదిరించినవారు లేరు. ముస్లిం తదితర మైనారిటీల పట్ల బిజెపి నేతలు, కార్యకర్తలు బహిరంగంగా విమర్శలకు తెగబడుతున్నారు. హిందూ మతంలోని వర్ణ వ్యవస్థను పెంచి పోషించి దళిత, ఆదివాసీ, నిమ్నవర్గాలను అడుక్కి నెట్టేసి అగ్ర వర్ణాలకు ఊడిగం చేయించే ప్రమాదం ఉంది. వామ పక్షీయులకు, హేతువాదులకు రక్షణ కరువవుతున్నది. నిజానికి ఏ మతం అయినా ఆయా జాతిలో ఉన్న ఉన్నత వర్గాలకే మేలు చేస్తోంది అనేది చారిత్రిక సత్యం. ఏ కాలంలోనైనా మతం వల్ల రాజులైన క్షత్రియులు, మంత్రులైన బ్రాహ్మలు తప్ప మరే వర్గాలు బాగుపడకపోగా అవి ఎన్నో కష్టనష్టాలు అనుభవించాయి. ఉత్తరభారతంలో ఉన్నంతగా మతమౌఢ్యం దక్షిణాన లేదు. అందుకే బిజెపి ఉచ్చులో వారు పడడం లేదు. అయితే పరిస్థితి ఎలా ఉందంటే దక్షిణ భారత, మైనారిటీల ఓట్లు బిజెపి గెలుపును అడ్డుకోలేవు. మైనారిటీలకు వారు సీట్లు ఇవ్వరు, వారి ఓట్లను ఆశించరు. ఇందువల్ల బిజెపి కోల్పోయేదేమీ లేదు. ఇక దక్షిణ రాష్ట్రాల విషయానికొస్తే గత ఎన్నికల్లో కర్ణాటకలో 25, తెలంగాణాలో 4 చోట్ల తప్ప మిగితా 3 రాష్ట్రాల్లో బిజెపి ఖాతా తెరవలేదు. ఈసారి కర్ణాటకలో కాంగ్రెస్ పాలన ఉన్నందున మళ్ళీ అన్ని సీట్లు రాకపోవచ్చు. ఇక్కడ తేలేదేమిటంటే బిజెపి గెలుపోటములపై దక్షిణాది ప్రభావం శూన్యం. దేశ వ్యాప్తంగా మేము విస్తరించామని బిజెపి చెప్పుకోవడానికే మాత్రమే ఇక్కడి సీట్లు పనికొస్తాయి. సెక్యులర్ విధానాల విషయంలో బిజెపికి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ఎంచుకోవచ్చు. అయితే గత ఎన్నికల్లో 52 సీట్లకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఏ మేరకు కోలుకుంటుందో చెప్పలేము. పై సంఖ్యలో సగం దక్షిణాది పుణ్యమే. ఈసారి కూడా అదే పరిస్థితి ఉండొచ్చు. నెహ్రూ కాలం నుండి జాతీయ కాంగ్రెస్‌ని మోడీ నోటికొచ్చినట్లు తీసేసి మాట్లాడుతున్నా ఆయన మాటలకు దీటుగా సమాధానం ఇచ్చే సత్తా ఆ పార్టీలో ఎవరికీ లేదు. సంఖ్యా బలం, పద చాతుర్యంతో మెండుగా ఉన్న మోడీ నిండు సభలో కాంగ్రెస్‌ను కడిగేస్తుంటే ఆ పార్టీ నాయకుల ఎదుర్కోలేకపోయారు. మతమే ఆయన బలం. హిందూ దేవతలను, సంప్రదాయాలను ఉటంకిస్తూ ఓటర్ల మనసులో 'మన పార్టీ బిజెపి' అన్నరీతిలో బలమైన ముద్ర వేస్తున్నారు. అలా హిందువుల్లో సగానికి పైగా ఉన్న బహుజన వర్గాలను కూడా భక్తి, ముక్తి మార్గాల పేరుతో తమ బుట్టిలో వేసుకొని మోడీ ప్రచార యాత్ర నడిపిస్తున్నారు. సున్నితమైన మతం అంశంపై కాంగ్రెస్ నోరు విప్పే పరిస్థితి లేదు. ఎంతో కాలం తమ వెంట నడచిన మైనారిటీ, దళిత వర్గాలను కాంగ్రెస్ ఆకట్టుకోలేక పోతోంది. బిజెపి కేవలం అగ్రవర్ణాల ప్రయోజనమే కోరుతుంది అని, ఆలయాలు, దేవుళ్ళ కన్నా సామాజిక భద్రత ముఖ్యం అని కాంగ్రెస్ ధైర్యంగా చెప్పలేకపోతోంది. హిందువుల్లోని 90% అయిన శ్రామిక, వృత్తి జీవులు మతమాయలో పడిపోయారని ఉత్తర భారత ఓటర్ల ముందు ఘంటాపథంగా ప్రకటించలేకపోతోంది. సామాన్యుల కోసం బిజెపి ఇంతకాలం ఏమి చేసింది, తాము ఏం చేస్తాం అనే స్పష్టతను ఈయడంలో కాంగ్రెస్ విఫలమవుతోంది. ఉత్తరాన పుట్టిన బిజెపి దేశాన్నంతా ఏలుతుంటే దక్షిణాది రాష్ట్రాలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. మేధావి వర్గం, మానవ వనరులు, ప్రకృతి అనుకూలత ఉన్నా పారిశ్రామిక అభివృద్ధిలో కేంద్రం సహకరించడం లేదు. ఆ రాష్ట్రాల్లో తన జెండా ఎగుర వేయాలని చిన్న పార్టీలపై కక్ష కట్టింది. 2014 నుండి మోడీ పాలనలో దక్షిణది రాష్ట్రాలు చిక్కులే ఎదుర్కొన్నాయి. పదవులకు భ్రమసి దక్షిణాది పార్టీలు బిజెపితో జత కొడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల విభజన చట్టాన్ని సరిగ్గా అమలు చేయకుండా రెండు రాష్ట్రాలకు అన్యాయం చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ అని ఆ చట్టంలో ఉన్నా ఆ రాష్ట్రానికి అది కేంద్రం పనే కాదన్నట్లు పక్కన పెట్టేసింది. తెలంగాణ ఏర్పాటును తల్లిని చంపి బిడ్డని బతికించారని మోడీ ఎప్పుడు అంటుంటారు. మొదటి నుంచి తెలంగాణకు నిధుల కేటాయింపులో బిజెపి వివక్ష చూపుతోంది.

# పిస్తా రోజుకు 10 గింజలు తిన్నా ఆరోగ్యమే......



పిస్తాపప్పు తినడం వల్ల అనేక హృదయనాళ ప్రయోజనాలు లభిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. పిస్తాలు రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. గుండె సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల గుండె జబ్బులు రాకుండా కాపాడతాయి.రోజూ పిస్తాపప్పు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. కంటి ఆరోగ్యానికి అవసరమైన లుటిన్, జియాక్సంతిన్ అనే యాంటీఆక్సిడెంట్లు పిస్తాపప్పులో పుష్కలంగా ఉన్నాయి. ఒక నివేదిక ప్రకారం.. లుటీన్, జియాక్సంతిన్ కంటిశుక్లం వంటి దీర్ఘకాలిక కంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. వయస్సు-సంబంధిత సమస్యల నుండి రక్షించడంలో కూడా ఇవి సహాయపడతాయి. పిస్తా మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇందులో ఉండే విటమిన్ బి6 రక్తంలో హిమోగ్లోబిన్ పరిమాణాన్ని పెంచడానికి సహాయపడుతుంది. పిస్తాలో ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. తద్వారా ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను ప్రోత్సహిస్తుంది. ప్రీబయోటిక్స్ అని పిలువబడే ఒక రకమైన ఫైబర్ గట్‌లోని మంచి బ్యాక్టీరియాను ఫీడ్ చేస్తుంది. గ్యాస్, అజీర్తి వంటి సమస్యలు కూడా దూరం చేస్తుంది. పిస్తాలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. దాంతో బ్లడ్ షుగర్ లెవెల్స్ తగ్గించేందుకు చాలా బాగా ఉపయోగపడుతుంది. ఇందులో ఫెనోలిక్ కాంపౌండ్, కెరోటినాయిడ్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. డయాబెటిక్ రోగులకు బెస్ట్ డైట్ అంటున్నారు ఆరోగ్య నిపుణులు. పిస్తాపప్పులో ఉండే విటమిన్ ఇ చర్మం వయసు పెరిగే కొద్దీ యవ్వనంగా ఉండేలా చేస్తుంది. పురుషులలో అంగస్తంభన సమస్యలను పరిష్కరించడంలో పిస్తాపప్పులు బాగా ఉపయోగపడతాయి. అధిక ఫైబర్ కంటెంట్ కారణంగా, పిస్తాలు పెద్దప్రేగు క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

## మీకు దంత సమస్యలు ఉన్నాయా..?




ఈ రోజుల్లో గుండెపోటు సమస్య చాలా సాధారణం అయిపోయింది. గుండెపోటుకు వయోపరిమితి లేకుండా పోయింది. దీంతో ఏ వయసు వారైనా గుండెపోటుకు గురయ్యే ప్రమాదం ఉందంటున్నారు ఆరోగ్య నిపుణులు.గుండెపోటు ఎంత ప్రాణాంతక వ్యాధి. దీని వల్ల ఏటా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు సకాలంలో గుర్తించి, సకాలంలో చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది.గుండెపోటుకు ముందు ఛాతీ నొప్పి చాలా సాధారణం. కానీ ఛాతీ నొప్పి కాకుండా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, చేతుల్లో నొప్పి, దంతాలు, చిగుళ్లలో నొప్పి, చిగుళ్ల నుంచి రక్తస్రావం వంటి లక్షణాలు కూడా కన్పిస్తాయి.వైద్యుల అభిప్రాయం ప్రకారం.. దంతాలు, చిగుళ్ళలో పేరుకుపోయిన మురికి గుండె సిరల్లో చేరుతుంది. దీని కారణంగా సిరల్లో రక్త ప్రసరణకు అడ్డుపడే ప్రమాదం పెరుగుతుంది. అందుకే పంటి నొప్పి, చిగుళ్ల వాపు, రక్తస్రావం వంటి లక్షణాలు గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయి. పంటి నొప్పి తీవ్రతరం అవడంతోపాటు పంటి నుంచి రక్తస్రావం, చిగుళ్ల వాపుపాతోపాటు అధిక చెమట గుండెపోటుకు సంబంధించిన సంకేతాలు. కాబట్టి మీలో ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే అలర్ట్ అవ్వాలి. వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకుంటే ప్రమాదం నుంచి బయటపడొచ్చు.

# సమ్మర్‌లో వాల్‌నట్స్ తినొచ్చా.....?



ప్రస్తుతం ప్రజలంతా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. మంచి ఆరోగ్యకరమైన, బలవర్ధకమైన ఆహారంతో పాటు డ్రై ఫ్రూట్స్‌ని ఎక్కువగా తీసుకుంటున్నారు. అయితే, ఎండాకాలంలో డ్రై ఫ్రూట్స్ తినాలా వద్దా.. అనే సందేహంలో పడుతున్నారు చాలా మంది. శీతాకాలం వలె వేసవిలో కూడా డ్రైఫ్రూట్స్ ప్రయోజనాలు కలిగిస్తాయా లేదా అనే ప్రశ్నలు చాలా మందిలో ఉత్పన్నమవుతున్నాయి. అయితే, ముఖ్యంగా డ్రైఫ్రూట్స్‌లో వాల్‌నట్స్ చాలా పోషకాలు కలిగి ఉన్నాయి. అలాంటి వాల్‌నట్స్ ఏ సీజన్‌లోనైనా తినవచ్చని డైటీషియన్లు చెబుతున్నారు. శీతాకాలంలో మీరు దీన్ని ఏ రూపంలోనైనా తినవచ్చు, కానీ వేసవిలో తినే విధానాన్ని మార్చుకోవాలని చెబుతున్నారు. వాల్‌నట్స్‌లో మంచి మొత్తంలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇది ఆరోగ్యకరమైన శరీరానికి, ఆరోగ్యకరమైన మెదడుకు మంచిది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అయితే, వేసవి కాలం వేడిగా ఉంటుంది, వాల్‌నట్స్ కూడా వేడిని ఉత్పత్తి చేస్తాయి, కానీ, వేసవిలో వాల్‌నట్స్ తినేందుకు ఉపాయం ఉంది..అందుకోసం వాల్‌నట్స్ తినే ముందు రాత్రంతా నానబెట్టడం. ఇది వాల్‌నట్‌లలోని వేడిని శాంతింపజేస్తుంది.చాలా మంది వాల్ నట్స్ ను నేరుగా తింటారు. వాల్‌నట్‌లను పాలలో మరిగించి తింటే పోషకాలు ఎక్కువ.

# ప్రెగ్నెన్సీలో లైట్ లైన్ వచ్చిందా....?




పెళ్లి ఆ తర్వాత పిల్లలు.. ప్రతి ఒక్కరి లైఫ్ లో జరిగే సాదారణమైన ప్రక్రియ. పెళ్లి తర్వాత పిల్లలు పుట్టడం కాస్త లేట్ అయితే వామ్మో సమాజం నుంచి ఎదుర్కొనే ప్రశ్నలకు భయపడాల్సిందే. ప్రస్తుత ఆహార అలవాట్లు, వాతావరణంలో మార్పులు అన్నింటి దృష్ట్యా ఎన్నో వ్యాధులు వస్తున్నాయి. ఇక ఇందులో భాగంగానే పిల్లలు పుట్టడం కూడా కష్టంగానే మారింది. దీనివల్ల హాస్పిటల్స్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చి పడింది. అయితే ఎంతో ఎదురుచూపు తర్వాత పీరియడ్స్ మిస్ అయ్యాయా? పీరియడ్స్ మిస్ అయితే వెంటనే సంతోషంగా టెస్ట్ చేసుకుంటారు. కొందరికి పెళ్లి తర్వాత వెంటనే పిల్లలు వద్దు అనే ఆలోచన కూడా ఉంటుంది. ఏది ఏమైనా టెస్ట్ లో లైన్ కాస్త లైట్ గా వస్తే సంతోష పడాలో.. బాధ పడాలో అర్థం కాదు.

ఇంతకీ ఈ లైన్ అర్థం ఏమిటి? ఒక లైన్ వస్తే ప్రెగ్నెన్సీ కన్ఫామ్ కాలేదు అనుకుంటారు. ఇక కొన్ని సందర్భాల్లో మాత్రం పాజిటివ్ గా కాకుండా, నెగిటివ్ గా కాకుండా వీక్ లైన్ వస్తుంది. మరి దీన్ని ఏమని అర్థం చేసుకోవాలో తెలియక సతమతమవుతుంటారు. పీరియడ్స్ కు ముందే ప్రెగ్నెన్సీ వస్తుందా? లేదా? అనే యాంగ్జైటీ వల్ల కూడా వీక్ లైన్ వస్తుందట. కొందరికి పీరియడ్స్ సమయానికి రాకపోవచ్చు. అంటే ఎగ్ రిలీజ్ విడుదల ఆలస్యంగా అవుతుంది. అలాంటి సమయంలో కూడా వీక్ లైన్ వస్తుంది. అందుకే పీరియడ్స్ మిస్ అయిన వెంటనే టెస్ట్ చేసుకుంటే వీక్ ప్రెగ్నెన్సీ వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంటుంది అంటున్నారు వైద్యులు. కొన్ని సందర్భాలలో బేబీ గ్రోత్ ఎక్కువగా లేని సమయంలో, ముందుగా అబార్షన్ అయిన సందర్భంలో కూడా ఇలాంటివి సంభవిస్తాయట. ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ లో కూడా వీక్ ప్రెగ్నెన్సీ వచ్చే అవకాశం ఉంటుందట. సో లైట్ లైన్ వచ్చినప్పుడు టెన్షన్ పడకుండా మీ ఆరోగ్యాన్ని మానసిక పరిస్థితిని మెరుగ్గా ఉంచుకోండి.

లేదంటే దగ్గరలో ఉన్న డాక్టర్ ను సంప్రదించండి. కానీ ఈ సమయంలో జాగ్రత్తలు పాటించడం ముఖ్యం. వీక్ లైన్ స్ట్రాంగ్ అయ్యే వరకు జాగ్రత్త. మీకు కూడా ఇలాంటి వీక్ లైన్ వచ్చిందా? అయితే కంగ్రాచ్యులేషన్స్, అండ్ ఆల్ ది బెస్ట్ ఫర్ యువర్ బేబీ.

## నిద్రలేమికి చక్కటి పరిష్కారం...!




శరీరం సక్రమంగా పనిచేయాలంటే మంచి నిద్ర అవసరం. రాత్రిపూట మాత్రమే శరీరం తనను తాను పునరుత్పత్తి చేసుకోవడానికి, రాబోయే రోజు కోసం సిద్ధం చేసుకునే అవకాశాన్ని పొందుతుంది. అయితే, రాత్రిపూట నిద్రకు ఇబ్బంది పడే వారు చాలా మంది ఉన్నారు. ప్రస్తుత జీవిశైలి కారణంగా చాలామంది నిద్రలేమితో ఇబ్బంది పడుతున్నారు. ఫలితంగా అనేక రోగాలను కూడా కొనితెచ్చుకుంటున్నారు. అయితే, మీ నిద్ర నాణ్యత నిద్రవేళకు ముందు గంటలలో మీరు తినే ఆహారంపై ఆధారపడి ఉంటుంది. ఇది అసౌకర్యం, అజీర్ణం కలిగిస్తుంది. కాబట్టి నిద్రవేళకు ముందు అతిగా తినకూడదని సాధారణంగా సలహా ఇస్తారు. అయితే, కొన్ని ఆహారాలు మెదడును ప్రశాంతంగా ఉంచుతాయి. రాత్రి బాగా నిద్రపోవడానికి మీకు సహాయపడతాయి. అలాంటి వాటిలో అరటి పండు కూడా ఒకటి. పడుకునే ముందు అరటిపండు తింటే మంచి నిద్ర పడుతుందని నిపుణులు చెబుతున్నారు. పడుకునే ముందు అరటిపండు తినడం తీపి కోరికలను తీర్చడమే కాకుండా మంచి నిద్రకు దోహద పడుతుందన్నారు.

# ఖాళీ కడుపుతో త్రిఫల చూర్ణం తాగితే...!



చాలా మందికి ఉదయం నిద్ర లేవగానే త్రిఫల నానబెట్టిన నీటిని తాగే అలవాటు ఉంటుంది. అయితే దీని వల్ల కలిగే ప్రయోజనాల గురించి చాలా మందికి తెలియదు. త్రిఫలానికి వెయ్యి గుణాలు ఉన్నాయని ఆయుర్వేద గ్రంధాలు కూడా చెబుతున్నాయి. ఇది మూడు పండ్ల మిశ్రమం కాబట్టి దీనిని త్రిఫల అంటారు. ఉసిరికాయ, తానికాయ, కరక్కాయలను కలిపి త్రిఫలం అంటారు. ఒక్కో పండులో ఒక్కో రకమైన పోషక, ఆరోగ్య గుణాలు ఉంటాయి. త్రిఫల మూడు పండ్ల మిశ్రమంతో తయారవుతుంది. దీన్ని ఎంతో నాణ్యతగా తయారు చేస్తారు. దీని ప్రయోజనాలు కూడా అంతే ప్రత్యేకంగా ఉంటాయని చెప్పనవసరం లేదు. అయితే ఈ త్రిఫలం తీసుకోవడం వల్ల శరీరంలో కలిగే ఉపయోగం ఏమిటో నిపుణుల మాటల్లో మీకోసం..త్రిఫల జీర్ణక్రియను మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది. అందుకే చాలా మంది ఉదయాన్నే త్రిఫల లేదా త్రిఫల నానబెట్టిన నీటిని తాగుతారు. అయితే దీనితోపాటు గ్యాస్ మందు తీసుకోకూడదని ఆయుర్వేద గ్రంథాలలో సూచించారు. ఆయుర్వేద వైద్యులు కూడా అలాగే చెబుతున్నారు. త్రిఫల ప్రభావంతో దంతాల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

## ఉగాది పచ్చడి ఆరోగ్యదాయకం!



ఉగాది పండుగ అనగానే పచ్చడి గుర్తుకు వస్తుంది. ఈరోజు ఆరు రుచులు కలిగిన పచ్చడిని తయారు చేసి ఇంటిల్లిపాది తాగుతారు. కొన్ని సంస్థలు, కార్యాలయాలు దీనిని తయారు చేసి ఉచితంగా పంపిణీ చేస్తారు. ఉగాది పచ్చడిలో పులుపు, తీపి, కారం, ఉప్పు, వగరు,చేదు అనే ఆరు రుచులు కలుస్తాయి. ఆరు రుచుల సమ్మేళనం అయిన ఉగాది పచ్చడి తాగడం వల్ల రుచిని మాత్రమే అనుభూతిని పొందుతారని కొందరు భావిస్తారు. కానీ దీని వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా వేసవి కాలంలో ఈ ఉగాది పచ్చడి తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇంకా ఎలాంటి లాభాలు ఉన్నాయో చూద్దాం.. శీతాకాలం నుంచి వేసవి కాలం ప్రారంభంలో ఉగాది పండుగ వస్తుంది. ఈ సమయంలో అనేక ఆరోగ్య ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి. వీటి నుంచి కాపాడుకునేందుక పూర్వ కాలంలో ఉగాది పచ్చడిని తయారు చేశారని కొందరు చెబుతుంటారు. ఇందులో ఉన్న ఆరు పదార్థాలు ఒక్కో ప్రయోజనాన్ని కలిగి ఉంటుంది. ఉగాది పచ్చడిలో బెల్లం, వేప పువ్వు వేస్తుంటారు. ఈ రెండు మిశ్రమాల వల్ల శరీరంలో ఉండే విష పదార్థాలు తొలగిపోతాయి. వేప పువ్వులు ఎంజైమ్ లు ఉంటాయి. ఇవి హానికరమైన టాక్సిన్స్ ను తొలగిస్తాయి. బరువు తగ్గాలని ఇటీవల కొందరు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కానీ వేప పువ్వు, బెల్లం కలిపిన మిశ్రమం తీసుకోవడం వల్ల బరువు త్వరగా తగ్గే అవకాశం ఉంది. కొవ్వును కాల్చేయడంలో ఇది ఉపయోగపడుతుంది. గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్న వారు ఉగాది పచ్చడి మేలు చేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చక్కెర నిల్వలను సమతుల్యం చేస్తాయి. చర్మాన్ని ప్రకాశవంతంగా ఉంచడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఉగాది సమయంలో వేసవి కాలం ప్రారంభమవుతుంది. దీంతో డీ హైడ్రేషన్ కు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ సమస్య నుంచి బయటపడడానికి బెల్లం నీరు తీసుకోవడం ఎంతో మంచింది. అందువల్ల ఉగాది పచ్చడి తీసుకోవడం వల్ల వడదెబ్బ సమస్య నుంచి తట్టుకోవచ్చు. ఉగాది పచ్చడిలో కొత్త మామిడి ముక్కలు వేస్తారు. దీని వల్ల ఉష్ణోగ్రత నుంచి తట్టుకునే శక్తి వస్తుంది. ఇవే కాకుండా అజీర్ణం, డీ హైడ్రేషన్ తదితర ఆరోగ్య సమస్యల నుంచి ఉగాది పచ్చడి కాపాడుతుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చక్కెర నిల్వలను సమతుల్యం చేస్తాయి. చర్మాన్ని ప్రకాశవంతంగా ఉంచడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఉగాది సమయంలో వేసవి కాలం ప్రారంభమవుతుంది.





# రూట్ మార్చిన ఫహద్ ఫాసిల్..

తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి తలైవా 170. జై భీమ్ ఫేం టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి వేట్టైయం టైటిల్‌ను ఫైనల్ చేశారని తెలిసిందే. టైటిల్ టీజర్‌ను విడుదల చేయగా నెట్టింట చక్కర్లు కొడుతోంది. బుక్ రీడింగ్ తర్వాత చేతిలో స్టిక్ పట్టుకొని.. స్టైలిష్ గాగుల్స్ పెట్టుకున్న రజినీకాంత్ అభిమానులకు విజువల్ ట్రీట్ అందించడం ఖాయమని ఈ విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుబాస్కరన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో గురు ఫేం రితికా సింగ్ ఈ చిత్రంలో వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ మరో కీ రోల్ పోషిస్తున్నాడు. ఫహద్ ఫాసిల్ ఈ మూవీలో తన పాత్ర ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేసి అందరినీ ఖుషీ చేస్తున్నాడు. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో ఫహద్ ఫాసిల్ మాట్లాడుతూ.. ఈ చిత్రంలో తాను కామెడీ టచ్‌తో సాగే పాత్రలో కనిపించనున్నట్టు చెప్పాడు. ఈ రోల్ ప్రస్తుతం తాను చేస్తున్న పాత్రలకు చాలా దూరంగా ఉంటుందన్నాడు. ఇక సీరియస్ కథాంశాలతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఫహద్ ఫాసిల్ నాన్ సీరియస్ రోల్‌లో ఎలా కనిపించబోతున్నాడోనని ఈ వార్త తెలిసిన అభిమానులు, మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో మంజు వారియర్, రానా దగ్గుబాటి, రావు రమేశ్, రోహిణి మొల్లేటి, దుషారా విజయన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వేట్టైయం ఈ ఏడాది అక్టోబర్‌లో థియేటర్లలో సందడి చేయనుంది.

# అందుకే పెళ్లి విషయం చెప్పలేదు

అగ్ర కథానాయిక తాప్సీ ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. చిరకాల స్నేహితుడు, డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మాథియస్ బోతో ఈ భామ మార్చి 23న పెళ్లిపీటలెక్కింది. కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో అత్యంత గోప్యంగా ఈ వివాహం జరిగింది. పెళ్లి తాలూకు ఫొటోలు కూడా బయటకు రాలేదు. ఇండస్ట్రీకి చెందిన తాప్సీ సన్నిహిత మిత్రులు తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేసిన ఫొటోల ద్వారా పెళ్లి విషయం బయటకు వచ్చింది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన వివాహం గురించి స్పందించింది తాప్సీ. పెళ్లి గురించి అందరూ చర్చించుకోవడం తనకు ఇష్టం లేదని, అందుకే అనవసర ఆర్భాటాలకు దూరంగా నిరాడంబరంగా పెళ్లి చేసుకున్నానని తెలిపింది. ఆమె మాట్లాడుతూ 'నా కుటుంబం, సన్నిహితుల అంగీకారంతోనే పెళ్లి చేసుకున్నా. నా పెళ్లి గురించి ప్రపంచం మొత్తానికి తెలియాల్సిన అవసరం లేదనిపించింది. అంత మాత్రాన ఎప్పటికీ రహస్యంగా ఉంచాలనుకోవడం లేదు. ప్రస్తుతానికైతే నా పెళ్లి ఫొటోలను షేర్ చేసే ఆలోచన లేదు. భవిష్యత్తులో నా అభిప్రాయం మారితే అప్పుడు ఫొటోలను పంచుకుంటాను' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ భామ హిందీలో 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా' చిత్రంలో నటిస్తున్నది.






# శిఖర్ తనకు ముందు నుంచి ఫ్రెండ్

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్.. ముంబైలో జరిగిన మైదాన్ ఫిల్మ్ స్క్రీనింగ్‌కు హాజరైంది. ఆ చిత్రాన్ని జాన్వీ తండ్రి బోనీ కపూర్ ప్రొడ్యూస్ చేశారు. ఆ స్క్రీనింగ్ ఈవెంట్‌కు వైట్ పాంట్‌సూట్‌లో వచ్చిన జాన్వీ చాలా స్పెషల్‌గా కనిపించింది. ధగధగలాడే నక్లెస్‌ను ఆమె ధరించింది. అయితే ఆ హారంపై బాయ్‌ఫ్రెండ్ శికూ పేరు రాసి ఉన్నట్లు గుర్తించారు. జాన్వీ బాయ్‌ఫ్రెండ్ శిఖర్ పహరియా ముద్దు పేరు శికూ. ఇటీవల కరణ్ జోహార్‌తో జరిగిన కాఫీ విత్ కరణ్ 8 షోలో శికూ గురించి జాన్వీ చెప్పింది. స్పీడ్ డయల్ లిస్టులో ఉన్న ముగ్గురు పేర్లు చెప్పాలని కోరగా, శికూ పేరును జాన్వీ చెప్పింది. శిఖర్ పహరియాతో ఉన్న రిలేషన్ గురించి కరణ్ జోహార్ తన చాట్ షోలో అడిగాడు. మీ ప్రేమ వ్యవహారం చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందని, తొలుత శిఖర్‌తో డేటింగ్ చేశారని, ఆ తర్వాత మరొకరితో డేటింగ్ చేశారని, మళ్లీ ఇప్పుడు శిఖర్‌తో డేటింగ్ చేస్తున్నారని, ఇది నిజమా లేక అబద్ధమా అని జాన్వీని కరణ్ అడిగాడు.. దాని జాన్వీ బదులిస్తూ.. నాదాన్ పరిందే ఘర్ ఆజా సాంగ్‌ను తన కోసం శికూ పాడి వినిపించేవాడని ఆమె అన్నారు. శిఖర్ తనకు ముందు నుంచి ఫ్రెండ్‌గా ఉన్నాడని, తన నుంచి అతను ఏదో ఆశిస్తున్నాడని అనుకోవడం లేదని, ఎటువంటి స్వార్థం లేకుండా అతను తనతో ఉన్నట్లు జాన్వీ చెప్పింది.

# రూ.50తో ప్రారంభించి రూ.14 వేల కోట్లకు వ్యాపార విస్తరణ మీనన్ జీవితం స్ఫూర్తిదాయకం




దృఢ సంకల్పం, కష్టబడి పనిచేసే తత్వం, ఆత్మవిశ్వాసం ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. ఈ లక్షణాలు కలిగిన చాలా మంది వ్యక్తులు జీవితంలో విజయం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. కేరళ రాష్ట్రానికి చెందిన పుత్తన్ నడువక్కట్ చెంతమరాక్ష మీనన్ (పీఎన్‌సీ మీనన్) కూడా అలాంటి వారే. కేవలం రూ. 50 తో జీవితాన్ని ప్రారంభించిన ఆయన రూ. 14 వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించారు. దృఢ సంకల్పం, కష్టబడి పనిచేసే తత్వం, ఆత్మవిశ్వాసం ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. ఈ లక్షణాలు కలిగిన చాలా మంది వ్యక్తులు జీవితంలో విజయం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. కేరళ రాష్ట్రానికి చెందిన పుత్తన్ నడువక్కట్ చెంతమరాక్ష మీనన్ (పీఎన్‌సీ మీనన్) కూడా అలాంటి వారే. కేవలం రూ.50 తో జీవితాన్ని ప్రారంభించిన ఆయన రూ. 14 వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించారు. కళాశాల విద్య కూడా పూర్తి చేయని ఆయన విద్యార్థులు, యువతకు స్ఫూర్తిదాయకమయ్యారు. ఆయన విజయగాథను తెలుసుకుందాం.

**చిన్న వయసులోనే తండ్రి మరణం**

పీఎన్ సీ మీనన్ కేరళలోని పాల్ ఘాట్ జిల్లాలో జన్మించారు. ఆయన తండ్రి సాధారణ రైతు. మీనన్ కు పదేళ్ల వయసు వచ్చేటప్పటికీ ఆయన తండ్రి మరణించారు. దీంతో ఆర్థిక కష్టాలు చుట్టుముట్టాయి. నిరక్షరాస్యుడైన తాత, తరచుగా అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి కారణంగా మీనన్ చదువుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాడు. ఎంతో కష్టబడి ప్రాథమిక పాఠశాల విద్యను పూర్తి చేశాడు. తర్వాత ఆయన చదువు ముందుకు సాగలేదు. బీకామ్ పూర్తి చేయడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. శోభా డెవలపర్స్ ప్రారంభం.. 1990లో నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ పరిశ్రమ నెమ్మదిగా జోరందుకుంటోంది. ఈ విషయాన్ని మీనన్ గమనించారు. 1995లో శోభా డెవలపర్స్ (ప్రస్తుతం శోభా లిమిటెడ్)ను స్థాపించాడు, ఇప్పుడు ఇది దేశంలోనే అతిపెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీ. దీంతో పాటు మిడిల్ ఈస్ట్‌లో కంపెనీ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. మీనన్ కు డిజైన్లు రూపొందించడంతో ఎంతో నైపుణ్యం ఉంది.

## ఒకే రోజు 2 కొత్త రికార్డులు!




**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ.. ప్రపంచ మార్కెట్లపై ఆశావహ దృక్పథం, విదేశీ కొనుగోళ్లు మన సూచీలకు కలిసొచ్చింది. ముఖ్యంగా రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు సూచీలను ముందుకు నడిపించాయి. దీంతో సూచీలు భారీగా లాభపడ్డాయి. ఈ క్రమంలోనే మార్కెట్లలో రెండు సరికొత్త రికార్డులు నమోదయ్యాయి. ఇంట్రాడేలో 74,869.3 పాయింట్ల వద్ద జీవనకాల గరిష్ఠాలను తాకిన సూచీ.. కాస్త క్షీణించినప్పటికీ తొలిసారి 74,700 ఎగువన ముగిసింది. అలాగే, మదుపరుల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీ మొత్తం విలువ సైతం తొలిసారి రూ.400 లక్షల కోట్లు దాటింది. అటు నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 22,700 మార్కును దాటి చివరికి 22,650 ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 74,555.44 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా కొనుగోళ్ల సందడితో అదే ఒరవడి కొనసాగింది. ఓ దశలో 600 పాయింట్ల మేర లాభపడిన సూచీ.. చివరికి 494.28 పాయింట్ల లాభంతో 74,742.50 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 152.60 పాయింట్లు లాభపడి 22,666.30 వద్ద ముగిసింది.

డాలరుతో రూపాయి మారకం విలువ 83.31గా ఉంది. సెన్సెక్స్‌లో మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్టీపీసీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్‌అండ్‌టీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. నెస్లే ఇండియా, విప్రో, సన్‌ఫార్మా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టైటాన్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ రకం బ్యారెల్ చమురు ధర 90.34 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2355 డాలర్ల స్థాయికి చేరింది.

## పోస్టాఫీస్ మంత్లీ ఇనకమ్ స్కీం.. ఎవరు అర్హులు?




మదుపరులకు లాభాలిచ్చే సురక్షితమైన పెట్టుబడులను కోరుకునేవారికి పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం ఓ చక్కని అవకాశం. ఇందులో మదుపరికి నెలనెలా వడ్డీ చెల్లింపులుంటాయి. మూడు నెలలకోసారి కేంద్రం వడ్డీరేట్లను సవరిస్తుంది. ఎవరు అర్హులు? సింగిల్‌గానైనా, జాయింట్‌గానైనా ఈ స్కీంలో చేరవచ్చు. జాయింట్ అకౌంట్‌లో ముగ్గురిదాకా వీలుంటుంది. మైనర్ల తరఫున వారి గార్డియన్లు తీసుకోవచ్చు. అలాగే పదేండ్లు నిండిన మైనర్ సొంతంగా చేరవచ్చు.

**పెట్టుబడికి పరిమితి**

వెయ్యి రూపాయలకు తగ్గకుండా గరిష్ఠంగా సింగిల్ అకౌంట్‌లో రూ.9 లక్షలు, జాయింట్ అకౌంట్‌లో రూ.15 లక్షలు పెట్టుబడిగా పెట్టవచ్చు. జాయింట్ అకౌంట్‌లో ముగ్గురుంటే ఒకొక్కరు రూ.5 లక్షల చొప్పున పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

## ‘యాపిల్ ఆవాస్ యోజన’ పేరుతో ఉద్యోగులకు 78 వేల ఇళ్లు..!



ఉద్యోగులు చేస్తున్న పనికి కేవలం జీతం ఇచ్చి ఇంటికి పంపించకుండా వారికి మౌలికసదుపాయాలు కల్పించడంపై ప్రముఖ కంపెనీలు దృష్టిసారిస్తున్నాయి. అందులో భాగంగా తాజాగా ప్రపంచ నం.1 కంపెనీ అయిన యాపిల్ తన ఉద్యోగులకు ఏకంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించినట్లు కొన్ని మీడియా కథనాల ద్వారా తెలిసింది. ఈమేరకు ఇండస్ట్రియల్ హౌజింగ్ మోడల్స్ పేరుతో ఇప్పటికే చైనా, వియత్నాం వంటి దేశాల్లో అమలులో ఉన్న ఈ విధానాన్ని భారత్‌లో ప్రవేశపెట్టబోతున్నట్లు అధికారులు తెలిపారు. గడిచిన రెండున్నరేళ్లలో ఇండియాలో 1.5 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు యాపిల్ వర్గాలు తెలిపాయి.

వీరికి ఇళ్లు నిర్మించేలా కంపెనీ చర్యలు తీసుకోబోతున్నట్లు అధికారులు చెప్పారు. భారత్‌లో యాపిల్ ఉత్పత్తులను తయారుచేస్తున్న ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్, సాల్‌కాంప్ వంటి సంస్థలు తమ ఉద్యోగుల కోసం గృహాలను నిర్మించే ప్రక్రియలో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో ‘యాపిల్ ఆవాస్ యోజన’ పేరుతో గృహ నిర్మాణ పథకాన్ని ప్రారంభించనున్నట్లు వార్తాకథనాల ద్వారా తెలిసింది. ఈ పథకం కింద దాదాపు 78,000 యూనిట్ల ఇళ్లను నిర్మించాలని నిర్ణయించారు. అందులో గరిష్ఠంగా తమిళనాడులోనే 58,000 యూనిట్ల ఇళ్ల కేటాయింపులు జరగనున్నాయి. స్టేట్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ ఆఫ్ తమిళనాడు (సిప్‌కాట్) సహకారంతో ఆ రాష్ట్రంలో ఇళ్లు నిర్మిస్తారని ప్రభుత్వ అధికారులు తెలిపారు. టాటా గ్రూప్‌తోపాటు ఎస్‌పీఆర్ ఇండియా నుంచి ఈ పథకానికి సహకారం అందనుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు 10-15% నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి రానున్నాయి. మిగిలినవి రాష్ట్ర ప్రభుత్వాలు, పారిశ్రామికవేత్తల నుంచి సేకరించనున్నట్లు తెలిసింది. మార్చి 31, 2025లోపు గృహాల నిర్మాణం పూర్తి చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.

## వాహన పరిశ్రమపై హెచ్చు వడ్డీ రేట్ల ఒత్తిడి!



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వరుసగా 14 మాసాల నుంచి వడ్డీ రేట్లను తగ్గించకపోవడంతో వాహన పరిశ్రమపై ఒత్తిడి నెలకొందని ఆ రంగం డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తోన్నారు. అన్ని వాహనాల రిటైల్ అమ్మకాలపై ప్రభావం పడుతోందని.. ముఖ్యంగా చిన్న, ప్రవేశ స్థాయి వాహన కొనుగోలుపై హెచ్చు వడ్డీ రేట్లు ఒత్తిడిని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24లో 42 లక్షల ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు జరిగాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఎఫ్ఎడిఎ) సోమవారం వెల్లడించింది. రేపోరేటు యథాతథంగా కొనసాగింపునతో ప్రాథమిక స్థాయి వాహనాలపై ఒత్తిడి ఎక్కువగా ఉందని తెలిపింది. ఎఫ్ఎడిఎ రిపోర్ట్ ప్రకారం.. 2023-24లో ద్విచక్ర వాహన అమ్మకాలు ఇప్పటికీ కోవిడ్ ముందు స్థాయి కంటే వెనుకబడి ఉన్నాయి. చిన్న కార్ల విభాగం అమ్మకాల్లో 3 శాతం తగ్గుదల నమోదవుతోంది. కొన్ని సంవత్సరాల క్రితంతో పోల్చితే 30 శాతం కంటే తక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ మారుతి సుజుకీ ఛైర్మన్ ఆర్‌సి భార్గవ ఎప్పటిలాగే ఆశాజనకంగా ఉన్నారు. ఎంట్రీ లెవల్‌లో కస్టమర్ల ఆదాయం పెరగడంతో 2026 నాటికి చిన్న కార్లకు మరింత డిమాండ్ పెరగొచ్చని భార్గవా పేర్కొన్నారు. అధిక ద్రవ్యోల్బణానికి తోడు విత్త రేట్లలోనూ ఉపశమనం లేకపోవడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారని ఎఫ్ఎడిఎ పేర్కొంది. రాబోయే ఎన్నికలతో పాటు, ఈ సవాళ్లు పరిశ్రమను ప్రభావితం చేస్తాయని విశ్లేషించింది. అన్ని విభాగాలలో వాహనాల అమ్మకాలపై ఒత్తిడి ఉండొచ్చు.


## పన్ను ఆదాకు 10 మార్గాలు..

### ఇలా చేస్తే నాలుగు డబ్బులు వెనకేసుకోవచ్చు!





ఆర్థిక సంవత్సరం ముగుస్తోందంటే ఉద్యోగులంతా పన్ను ఆదా ప్రణాళికల కోసం పరుగులు తీస్తారు. ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీమ్స్, యూలిప్స్, ఎల్ఐసీ, ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ), హెల్త్ ఇన్సూరెన్స్ అంటూ హడావుడిపడేవాళ్ల సంఖ్య ఈ సీజన్‌లో కాస్త ఎక్కువే. వాస్తవానికి మన ఓవరాల్ ప్లానింగ్‌లో పన్ను ఆదా ఒక భాగంగానే ఉండాలి. కానీ పన్ను తగ్గాలనే ఉద్దేశంతోనే మనం పెట్టుబడులు పెట్టకూడదు. అంతేకాదు ఏడాది మొదట్లోనే మనం ప్లానింగ్ ప్రారంభించాలి. చివరలో చేసే ఏ ప్రణాళికైనా పూర్తిస్థాయి ఫలితాలను ఇవ్వదని తెలుసుకోండి. కాబట్టి వచ్చే ఏడాది నుంచైనా ముందస్తు ప్రణాళిక ఉంటే మంచి వెల్త్ క్రియేట్ చేయడంతోపాటు నాలుగు డబ్బులు ఆదా చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ సమయంలో మనకు అందుబాటులో ఉన్న కొన్ని పన్ను మినహాయింపులు చూద్దాం. 1. హౌస్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ) ఉద్యోగి ఇంటి అవసరాలు తీర్చేందుకు సంస్థ.. వాళ్లకు ఇచ్చే అకామిడేషన్ ఖర్చును మనం హౌజ్ రెంట్ అలవెన్స్ కింద పరిగణిస్తాం. ఇది పాక్షికంగా లేదా పూర్తిగా మినహాయింపును పొందొచ్చు. ప్రస్తుతం మీరు ఉంటున్న ఇంటి రెంట్‌ను ఇది కవర్ చేస్తుంది. మీ శాలరీ ప్యాకేజీలో హెచ్ఆర్ఏ ఉన్నప్పుడు, అది కూడా మీరు పాత పన్ను విధానంలో ఉన్నప్పుడే ఈ క్లెయిం చేసుకోగలరు. 2. గృహ రుణ వడ్డీ మినహాయింపు మీరు గృహ రుణం తీసుకున్నప్పుడు దానిపై చెల్లించే వడ్డీని మినహాయింపుగా పొందవచ్చు. సెక్షన్ 24బీ కింద ఏటా గరిష్ఠంగా రూ.2 లక్షల హోమ్‌లోన్ వడ్డీని డిడక్షన్‌గా పొందవచ్చు.

## ఈ క్రెడిట్ కార్డు వాడేవారికి గుడ్ న్యూస్..




అత్యవసర సమయంలో డబ్బు అవసరం ఉన్నవారికి క్రెడిట్ కార్డులు మంచి నేస్తాలుగా మారాయి. కొన్ని అవసరాలకు క్రెడిట్ కార్డును వడ్డీ లేకుండా 45 రోజుల వరకు ఉపయోగించుకోవచ్చు. దీంతో అత్యవసం వస్తువులు కావాలనుకునేవారికి ఇది ఉపయోగపడుతోంది. క్రెడిట్ కార్డుల ద్వారా సరుకులు కొనుగోలు చేయాలనుకుంటే విక్రయషాపుల్లో స్వైప్ మిషన్ ఉండాలి. కానీ ఇప్పుడు కొత్తగా యూపీఐ ద్వారా క్రెడిట్ కార్డును వాడుకునే సదుపాయం వచ్చింది. ఇది రూపే కార్డుతోనే సాధ్యమవుతోంది. తాజాగా రూపే కార్డును ఎక్కువగా వినియోగించడానికి మరిన్ని సౌకర్యాలు కల్పించినట్లు నేషనల్ పేమేంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ సీపీ ఐ) తెలిపింది. ఆ వివరాల్లోకి వెళితే..కిరాణం షాపు నుంచి షాపింగ్ మాల్ వరకు క్రెడిట్ కార్డు వాడకం ఎక్కువైంది. లేటేస్టుగా రూపే క్రెడిట్ కార్డును ఫోన్ పే, గూగుల్ పే యాప్ లకు లింక్ చేసుకొని స్వైపింగ్ మిషన్ అవసరం లేకుండా వాడుకోవచ్చు. గడువులోగా బిల్లు చెల్లిస్తే ఈ మొత్తానికి ఎటువంటి అదనపు ఛార్జీలు పడవు. పైగా 45 రోజుల గడువు ఉంటుంది. దీంతో చాలా మంది వీటికి ఆకర్షితులవుతున్నారు. వీరిని మరింతగా ప్రోత్సహించడానికి ఎన్ సీపీఐ కొత్తగా ఆప్షన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. యూపీఐ ద్వారా రూపే క్రెడిట్ కార్డు వాడిన సమయంలో గడువులోగా బిల్లు చెల్లించడానికి డబ్బు లేకపోతే ఆ మొత్తాన్ని ఈఎంఐ గా మార్చుకోవచ్చు. ఇలా ఈఎంఐ మార్చుకోడానికి అక్కడే అప్షన్లను ఇచ్చినట్లు తెలిపారు. వీటితో పాటు క్రెడిట్ అకౌంట్ బిల్ పేమేంట్, ఇన్ స్టాల్ మెంట్ పేమేంట్ ఆప్షన్, లిమిట్ మేనేజ్ మెంట్ వంటి ఫీచర్లను సైతం అందుబాటులోకి తీసుకురానున్నారు. రూపే కార్డులు అందించిన బ్యాంకులు మే 31 లోగా ఈ ఫీచర్లను అందుబాటులోకి తీసుకురావాలని ఎన్ సీపీఐ తెలిపింది. ఇప్పటి వకు క్రెడిట్ కార్డు బిల్ పేమేంట్ వంటివి సంబంధిత బ్యాంక్ యాప్ లేదా ఆటోమేటిక్ డెబిట్ ఆప్షన్లు ఉండేవి. కానీ ఇప్పుడు బిల్ పేమేంట్ చేయడానికి సులభతరం చేసినట్లు ఎన్ సీపీఐ తెలిపింది. అంతేకాకుండా రూపే క్రెడిట్ కార్డు లిమిట్ పెంచమని బ్యాంకుకు నేరుగా వెళ్లకుండా ఇక్కడి నుంచే బ్యాంకును కోరే అవకాశం కూడా కల్పించనున్నారు. ఇక క్రెడిట్ కార్డు ఔట్ స్టాండింగ్ బిల్, మినమమ్ బిల్, టోటల్ అమౌంట్ వంటివి కూడా ఇప్పటి నుంచి తెలుసుకోవచ్చు. ఇది రూపే కార్డుతోనే సాధ్యమవుతోంది. తాజాగా రూపే కార్డును ఎక్కువగా వినియోగించడానికి మరిన్ని సౌకర్యాలు కల్పించినట్లు నేషనల్ పేమేంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ సీపీ ఐ) తెలిపింది. ఆ వివరాల్లోకి వెళితే..కిరాణం షాపు నుంచి షాపింగ్ మాల్ వరకు క్రెడిట్ కార్డు వాడకం ఎక్కువైంది.

# ఆర్టీఐ చట్టం కింద ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించేందుకు ఎస్‌బిఐ నిరాకరణ




న్యూఢిల్లీ: ఎన్నికల కమిషన్ (ఈసి)కి అందజేసిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఆర్టీఐ చట్టం కింద వెల్లడించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) నిరాకరించింది. అయినప్పటికీ ఆ రికార్డులు పోల్ ప్యానెల్ వెబ్‌సైట్‌లో, పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్ల పథకం "రాజ్యాంగ విరుద్ధం, స్పష్టంగా ఏకపక్షం" అని పేర్కొంటూ, ఏప్రిల్ 12, 2019 నుండి కొనుగోలు చేసిన బాండ్ల పూర్తి వివరాలను ఈసికి అందించండి అని సుప్రీంకోర్టు ఫిబ్రవరి 15న ఎస్ బిఐని ఆదేశించింది, అది తన వెబ్‌సైట్‌లో సమాచారాన్నిమార్చి 13న ప్రచురిస్తుందని తెలిపింది. మార్చి 11న, గడువును పొడిగించాలని కోరుతూ ఎస్‌బిఐ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది , మార్చి 12న పని వేళలు ముగిసేలోగా ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఈసికి వెల్లడించాలని ఆదేశించింది. ఆర్‌టిఐ కార్యకర్త కమోడోర్ (రిటైర్డ్) లోకేశ్ బాత్రా మార్చి 13న ఎస్‌బిఐని ఆశ్రయించి, సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత ఈసికి అందించిన ఎలక్టోరల్ బాండ్ల పూర్తి డేటాను డిజిటల్ రూపంలో ఇవ్వాలని కోరారు. సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కింద ఇచ్చిన రెండు మినహాయింపు నిబంధనలను ఉటంకిస్తూ బ్యాంక్ సమాచారాన్ని తిరస్కరించింది. అవి: సెక్షన్ 8(1)(ఇ) విశ్వసనీయ సామర్థ్యంలో ఉన్న రికార్డులకు సంబంధించినది, విత్‌హోల్డింగ్‌ని అనుమతించే సెక్షన్ 8(1)(జె) వ్యక్తిగత సమాచారం. ఇప్పటికే ఈసి వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారాన్ని ఎస్ బిఐ తిరస్కరించడం "విచిత్రం" అని బాత్రా పిటిఐ కి తెలిపారు.

# నిరాశా చీకట్లలో పొద్దుపొడిచిన ఆశా కిరణాలు



ఇంఫాల్ /చురాచాంద్‌పూర్ : మణిపూర్‌లో మెయిటీ, కుకీ తెగల మధ్య గత సంవత్సరం మొదలైన ఘర్షణల్లో 200 మంది కన్నా ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయిన విషాద సంఘటన ఇప్పటికీ అందరినీ వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రం మొత్తం మీద నిర్వాసితుల కోసం 280 పునరావాస శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే వీటిలో కొన్ని గర్భిణుల కోసం, బాలింతల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. అలాంటి ఆరు శిబిరాల్లో 200 మంది పసికందులు జన్మించడం నిర్వాసితుల్లో ఆనందం కలిగిస్తోంది. 11 నెలలుగా అనుభవించిన భయంకర సంఘర్షణలకు తమ జీవితాలు తారుమారైనప్పటికీ అవన్నీ మరిచిపోయి నవజాతలకు స్వాగతం పలుకుతున్నారు. ప్రసవించిన నవజాతలు తమకు అపురూప కానుకలుగా తలచుకుని మురిసిపోతున్నారు. నిరాశా నిట్టూర్పుల సమయంలో ఆశా కిరణాలు ఉదయించాయని భావిస్తున్నారు. బాలింతలు ఎవరికి వారు తమ అనుభూతిని పంచుకుంటున్నారు. పుట్టిన 200 నవజాతల్లో ఎన్‌గన్‌థొయిబీ పేరు గల శిశువు తల్లి హేత్నియు తన బిడ్డకు పెట్టిన పేరు గురించి వివరిస్తూ ఈ పేరుకు తగిన అర్థం 'ప్రకాశించిన కాంతి' అని వివరించింది. చురాచాంద్‌పూర్ శిబిరంలో ఆమె ఉంటోంది. ఇంఫాల్ వ్యాలీలో వెదురువస్తువుల దుకాణం నడిపే ఈమె కుకీ తెగకు చెందినది. గత నెలలోనే ఆమె బిడ్డను ప్రసవించింది. కాక్‌చింగ్ జిల్లాలోని నిర్వాసిత శిబిరంలో ఉంటున్న 26 ఏళ్ల మహిళ మగ కవలలను ప్రసవించింది. వారికి ఇప్పుడు నాలుగు నెలల వయసు. నా బాధలన్నీ కరిగిపోయాయని సంతోషాన్ని వ్యక్తం చేసింది. చురాచాంద్‌పూర్ శిబిరంలోఉంటున్న మరో మహిళ లూ లామ్వా ఎన్‌గహ్‌జెంకిం ఘర్షణల సమయంలో ఎనిమిది నెలల గర్భిణి. నెల తరువాత ఆమె ఆడబిడ్డను ప్రసవించింది. ఈ శిశువుకు క్రిస్టీ అనే పేరు పెట్టింది. వెండివెలుగుల కాంతిగా తన బిడ్డను చూసుకుంటోంది. తొమ్మిది నెలల క్రిస్టీ ఇప్పుడు ప్రాకుతోంది. ఆకంపట్ శిబిరంలో ఉన్న టిహెచ్ అంజలి గత అక్టోబర్‌లో ఆడబిడ్డను ప్రసవించింది. ఇంతవరకు తాము బతికి ఉన్నందుకు ధన్యవాదాలని తన గత భయానక సంఘటనలను తలచుకుంది. ఇంఫాల్ వ్యాలీలో గర్భిణుల కోసమే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో 168 మంది శిశువులు జన్మించడం గమనార్హం. గత మే 21న ప్రారంభించిన ఈ శిబిరంలో 164 మంది మహిళలు ఉండేవారు. అయితే అందరూ ప్రసవించిన తరువాత మరెవరూ లేక పోవడంతో ఈ శిబిరాన్ని మూసివేశారు. గత ఏడాది మే నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 168 మంది శిశువులు జన్మించారని మణిపూర్ బీజేపీ అధ్యక్షురాలు శారదాదేవి వివరించారు.

# సైనిక్ స్కూళ్ల ప్రైవేటీకరణ ఆపండి



న్యూఢిల్లీ: దేశంలోని సైనిక్ స్కూళ్లను ప్రైవేటుపరం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచనను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, ఇందుకు సంంధించి కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని ఆయన తన లేఖలో డిమాండు చేశారు. భారతీయ ప్రజాస్వామ్యంలో సాయుధ దళాలు రాజకీయాలకు అతీతంగా ఉండడం సాంప్రదాయంగా వస్తోందని, కాని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ గొప్పసాంప్రదాయాన్ని ముక్కలు చేసిందని తన రెండు పేజీల లేఖలో ఖర్గే పేర్కొన్నారు. ఒక్కో వ్యవస్థను ధ్వంసం చేసుకుంటూ వెళుతున్న ఆర్ఎస్ఎస్ తన భారీ కుట్రలో భాగంగా ఇప్పుడు సాయుధ దళాలనే దెబ్బతీసేందుకు పూనుకుందని, తన భావజాలాన్ని అటువంటి సంస్థలలో రుద్దడం వల్ల సైనిక పాఠశాలల జాతీయ స్వరూపమే దెబ్బతినే ప్రమాదముందని ఖర్గే పేర్కొన్నారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం తన ప్రైవేటీకరణ విధానాన్ని ఉపసంహరించుకుని ఇప్పటికే కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# లోక్‌సభ ఎన్నికల్లో అస్పష్ట తీర్పు.. మమతా బెనర్జీ ప్రధాని అయ్యే అవకాశం : సౌగతా రాయ్



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఏ కూటమికీ స్పష్టమైన మెజారిటీ రాదని, మమతా బెనర్జీ తదుపరి ప్రధాని అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగతా రాయ్ (77) ఆశాభావం వ్యక్తం చేశారు. జూన్ 4న అస్పష్ట తీర్పు వెలువడనుందని, 30 మందికి పైగా ఎంపీలతో మమతా బెనర్జీ ప్రధాని అయ్యే అవకాశం ఉందని అన్నారు. మూడు సార్లు ఆమె విజయవంతంగా సీఎం బాధ్యతలు నిర్వర్తించడం కూడా దీదీకి కలిసివస్తుందని చెప్పారు. ఇక నాలుగోసారి పార్లమెంట్ ఎన్నికల్లో తలపడుతున్న సౌగతా రాయ్ తన విజయంపై విశ్వాసం వ్యక్తం చేశారు. తాను నాలుగోసారి లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచానని, తాను గతంలో ఓ సారి బారక్‌పూర్ నుంచి కూడా ఎంపీగా ప్రాతినిధ్యం వహించానని చెప్పారు. తాను 1977లో తొలిసారి ఎంపీ అయిన క్రమంలో చరణ్ సింగ్, మొరార్జీ దేశాయ్ వంటి దిగ్గజ నేతలను చూశానని, ఇవాళ మీరు అలాంటి గొప్ప నేతలను చూడలేరని సౌగతా రాయ్ పేర్కొన్నారు. రోజులు మారాయని, తాను తొలినాళ్లలో సీనియర్ నేతలను సలహాల కోసం సంప్రదించేవాడినని, ఇప్పుడు గూగుల్ అంకుల్‌ను ఆశ్రయిస్తున్నానని చెప్పుకొచ్చారు.

## ఫిరాయింపులపై...

# న్యాయపోరాటం




హైదరాబాద్ : పార్టీ ఫిరాయింపులను నివారించేందుకు బిఆర్ఎస్ పార్టీ అనర్హ తా పిటిషన్లు దాఖలు చేయాలని నిర్ణయానికి వ చ్చింది. ఇలా చేయడం ద్వారా వలసలను అడ్డుకోవాలని పార్టీ భావిస్తోంది. రాజ్యాంగబద్ధంగా ఉ న్న అవకాశాన్ని వినియోగించుకోవడం ద్వారా ఎంఎల్ఎల వలసలకు అడ్డుకట్ట వేయాలని బిఆర్ఎస్ అధినాయకత్వం భావిస్తోంది. చట్టపరంగా అనర్హత వేటు పడేలా చూడడం ద్వారా ఇతర శా సనసభ్యులు పార్టీని వీడకుండా కట్టడి చేయవచ్చు ని పార్టీ అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలంటూ బిఆర్ఎస్ ఎంఎల్ఎ పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం హైకోర్టులో విచారణకు రానున్నది. బిఆర్ఎస్ బీ ఫాంపై గెలిచిన దానం నాగేందర్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీ తరపున పోటీ చేస్తున్న దానం నాగేందర్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఇప్పటికే బిఆర్ఎస్ ఎంఎల్ఎలు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఒక పార్టీలో ఎంఎల్ఎగా గెలిచిన వ్యక్తి మరొక పార్టీ ఎన్నికల అభ్యర్థి కావడానికి మించి అనర్హతా వేటుకు ఆధారం అవసరం లేదని బిఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. అనర్హతా పిటిషన్లను మూడు నెలల్లోగా తేల్చాలని సుప్రీంకోర్టు తీర్పు కూడా ఉందని ఆ పార్టీ చెబుతోంది. అలాగే స్టేషన్ ఘన్‌పూర్ ఎంఎల్ఎ కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపైనా అనర్హతా పిటిషన్ దాఖలుకు బిఆర్ఎస్ సిద్ధమైంది. త్వరలోనే కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపైనా హైకోర్టులో అనర్హతా పిటిషన్ దాఖలు చేయనున్నారు. వీరిలాగా బిఆర్ఎస్ బీ ఫాంతో గెలిచిన ఎంఎల్ఎలు ఎవరు పార్టీని వీడినా ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అనర్హతా పిటిషన్ దాఖలు చేయాలని పార్టీ అధిష్ఠానం ఇప్పటికే నేతలకు స్పష్టం చేసింది.

# అనిల్ అంబానీకి సుప్రీం కోర్టులో చుక్కెదురు



న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి సుప్రీంకోర్టులో చుక్కెదురయింది. తాజాగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అతడికి ఆశానిపాతం అయింది. అనిల్ అంబానీ రిలయన్స్ గ్రూప్కు చెందిన అనుబంధ సంస్థ అయిన ఢిల్లీ ఎయిర్ పోర్ట్ మెట్రో ఎక్స్ ప్రెస్ ప్రయివేట్ లిమిటెడ్ కు , ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ కు రూ. 8000 కోట్లు చెల్లించాల్సిన అవసరం లేదంటూ సుప్రీం కోర్టు ఇటీవల తీర్పునిచ్చింది. అయితే ఈ కేసులో 2021లో తానే ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తాజాగా పక్కనపెట్టింది. 2008లో డిఏఎమ్ఈపిఎల్, డిఎమ్ఆర్ సీలు 'కన్సెషన్ ఒప్పందం' కుదుర్చుకున్నాయి. తాజాగా అనిల్ అంబానీకి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. తాజా తీర్పుతో అనిల్ అంబానీ కంపెనీ రూ. 1678.42 కోట్లు డిఎమ్ఆర్ సీకి ఇవ్వాల్సి ఉంటుంది. తనకు అందని రూ. 6330.96 కోట్లనూ వదులుకోవాల్సి ఉంటుంది. ఈ తీర్పు కారణంగా రిలయన్స్ ఇన్ ఫ్రా షేరు ధర బుధవారం బిఎస్ఈ లో 19.99 శాతం(లోయర్ సర్క్యూట్) పడిపోయి రూ. 227.40 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 2250.02 కోట్లు కోల్పోయి, రూ. 9008.02 కోట్లకు పరిమితమయింది.

# కెనడా ఎన్నికలలో భారత్ జోక్యం లేదు



న్యూఢిల్లీ: కెనడా రాజకీయాలలో జోక్యం చేసుకోవడానికి భారత్ ప్రయత్నించలేదని కెనడా ఎన్నికలలో విదేశీ జోక్యం ఆరోపణలపై విచారణ జరుపుతున్న అధికారిక కమిషన్ స్పష్టం చేసింది. 2021లో జరిగిన కెనడా ఎన్నికలలో విదేశీ జోక్యం జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై సీనియర్ కెనడియన్ అధికారులతో కూడిన కమిషన్ దర్యాప్తు జరుపుతోంది. కెనడా జాతీయ ఎన్నికలను ప్రభావితం చేయడానికి భారత్ ఎటువంటి ప్రయత్నాలు చేయలేదని కమిషన్ ఎదుట హాజరైన ఒక ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. 2021 ఎన్నికల సందర్భంగా ప్రచారంలో జోక్యం చేసుకునేందుకు భారత ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రయత్నాలు జరగలేదని ఆ అధికారి కమిషన్‌కి తెలిపారు. అయితే కెనడాలో జరిగిన గత రెండు ఎన్నికలలో చైనా జోక్యం ఉన్నట్లు కెనడా నిఘా సంస్థ గుర్తించినట్లు కమిషన్ ఎదుట ఒక అధికారి వాంగ్మూలం ఇచ్చారు. 2019, 2021 ఎన్నికలలో జోక్యానికి భారత్, పాకిస్తాన్ ప్రయత్నించినట్లు కెనడా సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్(సిఎస్ఐఎస్) ఆరోపించిన కొద్ది రోజుల్లోనే భారత్ జోక్యం చేదన్న విషయంలో స్పష్టత వచ్చింది. ఆ రెండు ఎన్నికలలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు చెందిన లిబరల్ పార్టీ విజయం సాధించింది. చైనా ప్రమేయానికి సంబంధించి వచ్చిన వార్తలపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రతిపక్ష ఎంపీలు ఒత్తిడి తీసుకురావడంతో విదేశీ జోక్యం ఆరోపణల నిగ్గు తేల్చడానికి ట్రూడో ఒక విచారణ కమిషన్‌ను నియమించారు.

# 'వ్యూహంలో భాగంగా కాంగ్రెస్‌లోకి ఆర్ఎస్ఎస్ పంపింది'.. బీజేపీ నేత సంచలన వ్యాఖ్యలు



భోపాల్: మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ నాయకుడు రాజకీయ దుమారం రేపారు. వ్యూహంలో భాగంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) తనను కాంగ్రెస్‌లోకి పంపిందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన ఆయన ఓడిపోయారు. ఆ తర్వాత తిరిగి బీజేపీ గూటికి చేరుకున్నారు. బీజేపీ నాయకుడు రాంకిషోర్ శుక్లా అలియాస్ భయ్యాజీ ఈ మేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయ వ్యూహంలో భాగంగా ఆర్ఎస్ఎస్ తనను కాంగ్రెస్‌లోకి పంపిందని తెలిపారు. 'అసెంబ్లీ ఎన్నికలకు ముందు నేను కాంగ్రెస్‌లోకి మారా. కాంగ్రెస్ టికెట్‌పై మోవ్‌లో పోటీ చేసి ఓడిపోయా. ఇదంతా ఎన్నికల వ్యూహంలో భాగంగా జరిగింది. గత ఏడాది అక్టోబర్‌లో ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత ఆదేశాల మేరకు నేను అలా చేశా' అని మీడియాతో శుక్లా అన్నారు. కాగా, తాను అలా చేయడానికి బీజేపీ అభ్యర్థిని ఉషా ఠాకూర్ బలహీన పరిస్థితి కారణమని శుక్లా తెలిపారు. ఆమెకు పార్టీ నుంచే పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అనంత్‌సింగ్ దర్బార్ స్వతంత్ర అభ్యర్థిగా అక్కడ పోటీ చేశారని అన్నారు. ఈ రాజకీయ సమీకరణల వల్ల తాను త్యాగానికి సిద్ధమైనట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ నేత, వీహెచ్‌పీకి చెందిన ఇండోర్ విభాగం నేత అభిషేక్ ఉదేనియా తనను కాంగ్రెస్‌లోకి పంపారని శుక్లా వెల్లడించారు.

# హర్యానాలో స్కూల్ బస్సు బోల్తా: ఐదుగురు మృతి



హరియాణా రాష్ట్రం నార్నాల్ జిల్లాలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఓ వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తుండగా అదుపుతప్పిన స్కూల్ బస్సు బోల్తాపడింది. ఈ దుర్ఘనలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో మరో 15 మంది చిన్నారులకు తీవ్రగాయాల య్యాయి. గాయపడిన చిన్నారులకు తక్షణమే సమీప ఆస్పత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com